ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
తమిళనాడు
TAMILNADU
మంగళవారం 2 ఏప్రిల్ 2024



ఆంధ్రజ్యోతి పాఠకులకు గమనిక
ఆంధ్రజ్యోతి దిన పత్రిక కొత్త చందాదారులుగా చేరదలచుకున్న వారు, ప్రస్తుత చందాదారులకు పేపరు పంపిణీ విషయంలో ఏవైనా సమస్యలుంటే క్రింది ఫోన్ నెంబర్లను సంప్రదించగలరు.
A.C.O - 9003200801
S.R - 9551168092
27/11, సౌందరరాజన్ స్ట్రీట్, టి.నగర్, చెన్నై-600017

కచ్చాదీవిపై మాటల యుద్ధం



- ద్రోహం చేసిన కాంగ్రెస్‌తో చెలిమి అవసరమా? పీఎంకే
- ఎన్నికల బాండ్ల అవినీతిని కప్పిపుచ్చేందుకే: డీఎంకే
- మోదీతో కలిసి విముక్తి కలిగిస్తా: ఓపీఎస్
- మోదీ ఓ అబద్ధాల పుట్ట : టీఎన్‌సీసీ
- పాత సంగతిని తిరగతోడటమే: చిదంబరం

చెన్నై, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): అర్ధ శతాబ్దానికి ముందు శ్రీలంకకు కచ్చాదీవిని ధారాదత్తం చేసిన పాత సంగతిని తెరపైకి తెచ్చి ప్రధాని నరేంద్రమోదీ, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై లోక్‌సభ ఎన్నికల వేడిని రగిలించారు. కచ్చాదీవి వ్యవహారంలో డీఎంకే ద్వంద వైఖరి బట్టబయలైందని మోదీ, ఈ వ్యవహారంలో మాజీ ముఖ్యమంత్రి కరుణానిధి తీరని ద్రోహం చేశారంటూ అన్నామలై చేసిన ఆరోపణలు డీఎంకే కూటమి మిత్రపక్షాలకు ఆగ్రహం తెప్పించాయి. డీఎంకే అధ్యక్షుడు స్టాలిన్ నుంచి కాంగ్రెస్ సీనియర్ నేత పి.చిదంబరం వరకూ మోదీని దుయ్యబడుతూ ప్రకటనలు జారీ చేశారు. అదే సమయంలో ఎన్డీయే కూటమిలో స్థానం సంపాదించుకున్న పీఎంకే అధినేత డాక్టర్ రాందాస్, మాజీ ముఖ్యమంత్రి ఓపీఎస్... డీఎంకే ప్రభుత్వంపై విమర్శలు కుప్పించారు. పదేళ్లుగా అధికారంలో ఉన్నప్పుడు కచ్చాదీవి వ్యవహారం బీజేపీ పాలకులకు ఎందుకు గుర్తుకు రాలేదని డీఎంకే ధ్వజమెత్తింది. కాంగ్రెస్ సీనియర్ నేత పి.చిదంబరం కచ్చాదీవి శ్రీలంకలోని అంతర్భాగమేనని పదేళ్లకు ముందే విదేశీ వ్యవహారాల శాఖ అంగీకరించిందని, అలాంటప్పుడు సమసిపోయిన ఆ వివాదాన్ని తిరగదోడి మోదీ అభాసుపాలవుతున్నారని విమర్శించారు. లోక్‌సభ ఎన్నికల్లో తమిళ ఓటర్లను ఆకట్టుకునేలా ప్రచారం చేయడానికి ఏ అంశం లేకపోవడంతో కచ్చాదీవి వివాదాన్ని బీజేపీ నేతలకు తెరపైకి తెచ్చారని టీఎన్‌సీసీ విమర్శించింది. మోదీ ఓ అబద్ధాలపుట్ట అని టీఎన్‌సీసీ చీఫ్ సెల్వ పెరుందగై విరుచుకుపడ్డారు. కచ్చాదీవి వ్యవహారంలో ద్రోహం చేసిన కాంగ్రెస్ తో చెలిమి అవసరమా? అంటూ పీఎంకే వ్యవస్థాపకుడు డాక్టర్ రాందాస్ ప్రశ్నించారు. ఇక మాజీ ముఖ్యమంత్రి ఒ.పన్నీర్‌సెల్వం వీరందరికంటూ ఓ అడుగు ముందుకేసి ప్రధాని మోదీతో కలిసి కచ్చాదీవికి విముక్తి కలిగిస్తానంటూ శపథం చేశారు. ఇలా ప్రధాని మోదీ, విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి జయశంకర్ కచ్చాదీవి వ్యవహారంపై చేసిన వ్యాఖ్యలపై విపక్షాలు విరుచుకుపడటంతో రాష్ట్రంలో ఎన్నికల వేడి అధికమైంది.

చైనా దురాక్రమణపై మౌనం...


మంత్రి మనో తంగరాజ్

కచ్చాదీవి వ్యవహారాన్ని ప్రస్తావిస్తున్న ప్రధాని నరేంద్రమోదీ చైనా దురాక్రమణలపై ఎందుకు మౌనం పాటిస్తున్నారో సమాధానం చెప్పాలని మంత్రి మనో తంగరాజ్ డిమాండ్ చేశారు. పదేళ్లుగా చైనా భారత భూభాగంలో 96లక్షల ఎకరాలను ఆక్రమించుకుందని, దీనిపై మోదీ ఎలాంటి చర్యలు చేపట్టకుండా మౌనం పాటిస్తున్నారని ఆరోపించారు. అరుణాచల ప్రదేశ్‌లోనూ చైనా దురాక్రమణలకు పాల్పడుతున్నా మోదీ ప్రేక్షక పాత్రను పోషిస్తున్నారని ఆరోపించారు.

అసత్యాలతో ప్రచారం: సెల్వ పెరుందగై

దేశంలోనే ప్రధాని నరేంద్రమోదీని, బీజేపీని తీవ్రంగా వ్యతిరేకిస్తున్న రాష్ట్రం తమిళనాడే అని ఈ రాష్ట్రంలో ఎలాగైనా ఓట్లు దండుకోవాలని అసత్యాలతో ప్రచారం చేస్తున్నారని టీఎన్‌సీసీ అధ్యక్షుడు సెల్వ పెరుందగై పేర్కొన్నారు. ఐదు దశాబ్దాలకు ముందు జరిగిన కచ్చాదీవి వ్యవహారాన్ని తెరమీదికి తెచ్చి దుష్ప్రచారం సాగిస్తున్నారని తెలిపారు. గత పదేళ్లుగా అధికారంలో ఉన్న ప్రధాని మోదీకి కచ్చాదీవి వివాదం ఎందుకు గుర్తుకు రాలేదో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. 2014లో మోదీ ప్రధానిగా ఉన్నప్పుడే కచ్చాదీవి కేసు సుప్రీంకోర్టులో విచారణ జరిగినప్పుడు కేంద్ర ప్రభుత్వ తరఫు న్యాయవాది కచ్చాదీవికి విముక్తి కలిగించలేమని, ఆ దీవి హస్తగతం చేసుకోవాలంటే యుద్ధం చేయడమే సరైన మార్గమని వాదించారని, ఈ వివరాలు మోదీకి బాగా తెలుసు అన్నారు.

క్షమించరాని ద్రోహం...


రాందాస్

రాష్ట్రానికి చెందిన అంతర్భాగంగా ఉన్న కచ్చాదీవి ప్రాంతానికి మాజీ ప్రధాని ఇందిరగాంధీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం శ్రీలంకకు ధారాదత్తం చేసి క్షమించరాని ద్రోహానికి పాల్పడిందని, ఈ సంఘటన యాభై యేళ్ల నాటిది కదా అని తేలికగా విడిచిపెట్టేయాల్సిన సంగతి కాదని పీఎంకే వ్యవస్థాపకుడు డాక్టర్ రాందాస్ అన్నారు. ఈ మేరకు సోమవారం ఓ ప్రకటన జారీ చేశారు. కచ్చాదీవి ధారాదత్తం వల్ల ఇప్పటికి వరకూ రాష్ట్రానికిచెందిన 800 మందికిపై జాలర్లు శ్రీలంక నావికాదళం కాల్పుల్లో హతమయ్యారని, 6184 మంది జాలర్లను నిర్బంధించారని పేర్కొన్నారు. కచ్చాదీవిని శ్రీలంకకు ధారాదత్తం చేయడం సబబేనంటూ ఇప్పటికీ కాంగ్రెస్ చెబుతుండటం గర్హనీయమన్నారు. ఇలా తమిళ జాలర్లకు తీరని ద్రోహం చేసిన కాంగ్రెస్‌తో డీఎంకే చెలిమి అవసరమా అని ఆ పార్టీ నేతలు ఆలోచించాలన్నారు.

పదేళ్లుగా నిద్రపోతున్నారా?


డీఎంకే అధికార ప్రతినిధి శరవణన్

గత పదేళ్లుగా అధికారం చెలాయించిన బీజేపీ పాలకులు తమిళ జాలర్లపై దాడులు జరిగినా, శ్రీలంక నావికాదళం అక్రమంగా నిర్బంధించినా ఎలాంటి చర్యలు చేపట్టలేదని, ఈ సంఘటనలకు కచ్చాదీవే కారణమని తెలిసినా ఆ దీవికి విముక్తి కలిగించేందుకు చర్యలు తీసుకుండా నిదురపోయారా? అంటూ డీఎంకే అధికార ప్రతినిధి శరవణన్ విమర్శించారు.

ఇంత రాద్ధాంతం అవసరమా?


పి. చిదంబరం

కచ్చాదీవి శ్రీలంక అంతర్భాగమని 2015లో కేంద్రప్రభుత్వం ప్రకటించిందని, అలాంటప్పుడు కచ్చాదీవి ధారాదత్తం గురించి ప్రధాని మోదీ ఇంత రాద్ధాంతం చేయడం అవసరమా? అని కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నేత పి.చిదంబరం అన్నారు. 2015 జనవరి 27న అప్పటి విదేశీ వ్యవహారాల శాఖ కార్యదర్శిగా పనిచేసిన జయశంకర్ కచ్చాదీవికి శ్రీలంక ప్రభుత్వ పరిధిలో నిదేనంటూ స్పష్టంగా ట్వీట్ చేశారని, ఆ విషయం మరుగున పడటంతో లోక్‌సభ ఎన్నికల్లో తమిళనాట గెలిచే అవకాశం లేకపోవడం వల్లే పాత సంగతిని పట్టుకుని వేలాడుతున్నారని మోదీ, అన్నామలైపై ఆయన విరుచుకుపడ్డారు.

విముక్తి కలిగిస్తా


ఒ.పన్నీర్‌సెల్వం

ప్రధాని మోదీ సాయంతో కచ్చాదీవికి విముక్తి కలిగిస్తానని రామనాథపురం ఇండిపెండెంట్ అభ్యర్థి, మాజీ సీఎం ఒ.పన్నీర్ సెల్వం శపథం చేశారు. రామేశ్వరంలో సోమవారం ఉదయం ఆయన ప్రచారం చేస్తూ కచ్చాదీవి వ్యవహారం మళ్ళీ తెరపైకి వచ్చిందని, ఆ దీవిని శ్రీలంకకు ధారాదత్తం చేసి, అప్పటి కాంగ్రెస్, డీఎంకే పాలకులేనని ఆయన ఆరోపించారు. కచ్చాదీవికి రెండు నాటికల్ మైళ్లకు ముందే శ్రీలంక నావికాదళం సభ్యులు తమిళ జాలర్లను నిర్బంధిస్తున్నారని ఆయన చెప్పారు. ఈ వివాదాన్ని ప్రధాని మోదీ చక్కగా పరిష్కరించగలరనే నమ్మకం తనకుందని చెప్పారు.

కన్నియాకుమారి, ధనుష్కోడిలో 'అల'జడి

మినీ సునామీలా అలల తాకిడి ● భీతిల్లిన జనం


అలల తాకిడికి ధ్వంసమైన అరిచ్చలై మునై తారురోడ్డు

చెన్నై, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): దక్షిణాదిలో ప్రముఖ పర్యాటక ప్రాంతాలుగా ఖ్యాతిగడించిన కన్నియాకుమారి, ధనుష్కోడి, అరిచ్చలై మునై ప్రాంతాల్లో గత రెండు రోజులుగా అలల తాకిడి అధికమైంది. 10 నుండి 15 అడుగుల ఎత్తున తీరం వైపు అలలు దూసుకురావటంతో కన్నియాకుమారి జిల్లాని పలు సముద్రతీర ప్రాంతాల్లోని ప్రజలు భయాందోళనలకు గురయ్యారు. ఈస్టర్ సందర్భంగా వెళ్లిన పర్యాటకులు అలల ఉధృతిని చూసి భీతిల్లారు. మినీ సునామీని తలపించేలా జనావాస ప్రాంతాల్లో అలలు ఎగసిపడ్డాయి. కొల్లకోడ, మనతురై ప్రాంతాల్లో రాక్షస అలల తాకిడి ఇళ్లలోకి సముద్రపునీరు చొరబడింది. తీరం వద్దనున్న సిమెట్రి జలదిగ్బంధంలో చిక్కుకుంది. ఆదివారం సాయంత్రం నుంచి సోమవారం వేకువజాము వరకు తీరం పొడవునా అలల తాకిడి అధికమైంది. పోలీసులు, రెవెన్యూ అధికారులు కన్నియాకుమారి త్రివేణి సంగమం ప్రాంతంలో పర్యాటకులను అనుమతించకుండా కట్టుదిట్టం చేశారు. సోమవారం ఉదయం వివేకానంద స్మారక మండపానికి బోట్ సఫారీని కూడా రద్దు చేశారు.

ధనుష్కోడిలో బీభత్సం...

రామేశ్వరం సమీపం మన్నార్ జలసంధి ప్రాంతం వద్ద పర్యాటకులను, భక్తులను అమితంగా ఆకట్టుకునే ధనుష్కోడి, అరిచ్చలై మునై ప్రాంతాల్లో పది అడుగుల ఎత్తున అలలు ఎగసి పడడంతో ఆ ప్రాంతం అంతా అల్లకల్లోలంగా మారింది. రామేశ్వరం క్షేత్రాన్ని దర్శించిన భక్తులంతా ధనుష్కోడిని, అరిచ్చలై మునై ప్రాంతానికి సందర్శించడం ఆనవాయితీ. ఆ మేరకు సెలవు దినమైన ఆదివారం ఆ రెండు ప్రాంతాలను తిలకించేందుకు పర్యాటకులు పెద్ద సంఖ్యలో చేరుకున్నారు. ఈ నేపథ్యంలో ఆదివారం సాయంత్రం మన్నార్ జలసంధిలో పెనుగాలులు వీయడంతో అలలు పది నుంచి పదిహేను అడుగుల దాకా ఎగసిపడ్డాయి. ధనుష్కోడి జాలర్ల కుప్పాన్ని రాక్షస అలలు ముంచెత్తాయి. అంతే కాకుండా ధనుష్కోడి నుండి అరిచ్చలమునై దాకా ఉన్న జాతీయ రహదారి సైతం ధ్వంసమైంది. పలు చోట్ల ఇసుక తిన్నెలు కూడా కనిపించనంతగా అలలు ముంచెత్తాయి. అలల తాకిడిలో తీరం వద్ద నిలిపివుంచిన పడవలు కొట్టుకెళ్ళాయి. ఆదివారం రాత్రి 9 గంటల నుండి మళ్ళీ అలల తాకిడి తీవ్ర రూపం దాల్చాయి. అరిచ్చల్ మునై రహదారి కొన భాగానికి మూడువైపులా ప్రవహించే సముద్ర తీరంలోనూ అలలు ఉవ్వెత్తున ఎగసిపడ్డాయి. దీనితో ఆ తారు రోడ్డు పూర్తిగా కొట్టుకుపోయింది. సోమవారం ఉదయం కూడా అరిచ్చలై మునై వద్ద అలల తాకిడి అధికంగా ఉండటంతో ధనుష్కోడి, అరిచ్చలై మునై ప్రాంతానికి పర్యాటకులు వెళ్ళకుండా పోలీసులు, సముద్రతీర భద్రతా దళం అధికారులు కట్టుదిట్టం చేశారు. ధనుష్కోడి, ముకుందరాయర్ సత్తిరం ప్రాంతాలకు వెళ్ళాలనుకున్న పర్యాటకులు, భక్తులు పోలీసుల హెచ్చరికతో తిరుగుముఖం పట్టారు.


కన్నియాకుమారి తీరంలో జననివాస ప్రాంతాల వైపు దూసుకొచ్చిన సముద్రజలాలు


ధనుష్కోడి రహదారిపై ప్రవహిస్తున్న సముద్ర జలాలు

ఇంటింటికీ బూత్ స్లిప్‌ల పంపిణీ


బూత్ స్లిప్ పంపిణీని పరిశీలిస్తున్న చెన్నై జిల్లా ఎన్నికల అధికారి రాధాకృష్ణన్

ప్యారీస్, ఏప్రిల్ 1: రాష్ట్రంలో ఇంటింటికీ బూత్ స్లిప్‌ల పంపిణీ పనులు సోమవారం ప్రారంభమయ్యాయి. ఈనెల 13వ తేది వరకు ఓటు హక్కు కలిగిన వారికి ఈ స్లిప్పులు పంపిణీ చేయనున్నట్లు ఎన్నికల అధికారులు తెలిపారు. తమిళనాడు, పుదుచ్చేరి రాష్ట్రాల్లోని 40 పార్లమెంటు నియోజకవర్గాలకు ఈ నెల 19న పోలింగ్ జరగనున్న విషయం తెలిసిందే. రాష్ట్రవ్యాప్తంగా అభ్యర్థులకు మద్దతుగా ఆయా పార్టీల అగ్రనేతలు ప్రచారంలో పాల్గొంటున్నారు. 18 ఏళ్లు నిండిన యువత ఓటు హక్కు వినియోగించుకోవాలంటూ వివిధ రకాల అవగాహన ప్రచార కార్యక్రమాలు చేపడుతోంది. 2024 లోక్‌సభ ఎన్నికల్లో 3,06,02,367 మంది పురుషులు, 3,07,16,069 మంది మహిళలు, 8,465 మంది ఇతరులు అని మొత్తం 6,23,26,901 మంది ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో ఇప్పటికే 68,144 పోలింగ్ కేంద్రాలు అందుబాటులో ఉన్నాయి. 1,500 మందికి పైగా ఓటర్లున్న ప్రాంతాల్లో 177 కేంద్రాలను అదనంగా ఏర్పాటు చేసింది. పోలింగ్ శాతం 100 లక్ష్యంగా 85 ఏళ్ల పైబడిన వారికి, దివ్యాంగులకు, ఎన్నికల విధుల్లో పాల్గొంటున్న ప్రభుత్వ సిబ్బందికి ఓటు హక్కు వినియోగించే సౌలభ్యాన్ని ఎన్నికల సంఘం కల్పించింది.

13వ తేదీ వరకు

ప్రభుత్వ ఉద్యోగులు, టీచర్లు ఇంటింటికీ వెళ్లి బూత్ స్లిప్పులు పంపిణీ చేస్తున్నారు. గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ పరిధిలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఈనెల 13వ తేది వరకు పంపిణీ కొనసాగనుంది. వెప్పేరిలో బూత్ స్లిప్ పంపిణీని జీసీసీ కమిషనర్, చెన్నై జిల్లా ఎన్నికల అధికారి జె.రాధాకృష్ణన్ సోమవారం పరిశీలించారు. బూత్ స్లిప్ పంపిణీ పనుల్లో పాల్గొంటున్న వారు రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రతిపాదించిన ఓటరు జాబితా ప్రకారం ఒక్కరిని కూడా విడిచిపెట్టకుండా అందరికీ స్లిప్పులు పంపిణీ చేయాలని, ఇందులో ఎలాంటి నిర్లక్ష్యం చూపరాదని రాధాకృష్ణన్ ఉత్తర్వులు జారీచేశారు.

ఉదయనిధి చేతికి డీఎంకే పగ్గాలు: ఈపీఎస్


రాణిపేటలో అన్నాడీఎంకే కూటమి అభ్యర్థులకు మద్దతుగా ఏర్పాటైన ప్రచార సభ వేదిక నుంచి అభివాదం చేస్తున్న ఈపీఎస్

ప్యారీస్, ఏప్రిల్ 1: రాష్ట్ర యువజన సంక్షేమం, క్రీడాభివృద్ధి శాఖల మంత్రి ఉదయనిధి చేతికి డీఎంకే పగ్గాలు అప్పగించే ప్రయత్నాల్లో సీఎం స్టాలిన్ నిమగ్నమయ్యారని అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి ఆరోపించారు. చిదంబరం లోక్‌సభ స్థానంలో పోటీ చేస్తున్న అన్నాడీఎంకే అభ్యర్థి చంద్రహాసన్‌కు మద్దతుగా చిదంబరం బైపాస్ రోడ్డులో జరిగిన ఎన్నికల బహిరంగసభలో పాల్గొని పళనిస్వామి మాట్లాడారు. డీఎంకే రాజకీయపార్టీలా కాకుండా ప్రైవేటు కంపెనీలా మారిందని విమర్శించారు. అధికారాన్ని రాజరిక పాలనగా భావిస్తున్న ముఖ్యమంత్రి స్టాలిన్, ఆయన కుమారుడు ఉదయనిధి ప్రజా ప్రతినిధులుగా కాకుండా యజమానులుగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ప్రజలకు నిస్వార్థ సేవలు అందించడమే అన్నాడీఎంకే అజెండా అని ఈపీఎస్ తెలిపారు.

ప్రముఖ పబ్లిసిటీ డిజైనర్ మజ్జి రామారావు కన్నుమూత


మజ్జి రామారావు (ఫైల్ ఫొటో)


చెన్నై, ఏప్రిల్1 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ సినీ పబ్లిసిటీ డిజైనర్ మజ్జి రామారావు కన్నుమూశారు. చెన్నైలోని ఆయన స్వగృహంలో తుదిశ్వాస విడిచిన ఆయన భౌతికకాయానికి ఆదివారం అంత్యక్రియలు ముగిశాయి. ఆయన వయస్సు 82 సంవత్సరాలు. సినిమాలకు ప్రచార చిత్రకారుడిగా అర్ధ శతాబ్దానికి పైగా అనుభవం గడించిన కళారత్న రామారావు పశ్చిమ గోదావరి జిల్లా పోడూరు గ్రామంలో 1942లో అప్పాయమ్మ, లక్ష్మణ్ణ దంపతులకు జన్మించారు. పాఠశాల విద్యకే పరిమితమై చిత్రకళపై అభిరుచితో స్వయంకృషితో అభివృద్ధి చెందారు. 1956-60 మధ్య ప్రముఖ చిత్రకారుడు కేతా సాంబమూర్తి వద్ద శిష్యరికం చేశారు. 1961లో చిత్రకారుడిగా జీవితం ప్రారంభించారు. ప్రముఖ చిత్రకారులు కె.గంగాధర్, ఎంఎస్ మూర్తితో కలిసి సంగం ఆర్ట్స్‌ను స్థాపించారు. సరాగం పేరుతో పలు ప్రచురణ సంస్థలకు ముఖచిత్రాలు, పత్రికల్లో కథలకు చిత్రాలు, సినిమాలకు పబ్లిసిటీ డిజైనర్‌గా పనిచేశారు. చెన్నైలో 1965 నుంచి సొంతంగా రామారావు ఆర్ట్ సంస్థను ప్రారంభించి పబ్లిసిటీ డిజైనర్‌గా 300కు పైగా చిత్రాలకు పనిచేశారు. బాలమిత్ర, ఆంధ్ర సచిత్ర వారపత్రిక, యువ, స్వాతి, జ్యోతి మాసపత్రిక, సినిమా రంగం, వార, మాస పత్రికలకు ఇల్లస్ట్రేటర్‌గా వేలసంఖ్యలో బొమ్మలు గీశారు. పాకెట్ నవలలకు ముఖచిత్రాలు కూడా వేశారు. 1980 పేండి ఆయిల్ కలర్స్‌తో రూప చిత్రాలు వేస్తున్నారు. ఇప్పటికి పది కళాప్రదర్శనలు నిర్వహించారు. తమిళనాడు ఆర్ట్స్ అండ్ క్రాఫ్ట్స్ ఇంప్రూవ్‌మెంట్ అసోసియేషన్‌లో గత పదిసంవత్సరాలుగా వీరి చిత్రాలు ప్రదర్శించబడి ప్రశంసలందుకున్నారు. 2016లో ఆ సంస్థ చిత్రకళారత్న బిరుదుతో ఆయనను సత్కరించింది. 2018లో పాలకొల్లు లయన్స్ క్లబ్ 'కళాతపస్వి' బిరుదుతో సత్కరించింది. ఇదిలావుండగా ప్రముఖ చిత్రకారుడు అంకయ్య రామారావు మృతి పట్ల తీవ్ర సంతాపం ప్రకటించారు.

2752 మంది సైనికులకు పోస్టల్ ఓటింగ్‌కు చర్యలు

అడయార్, ఏప్రిల్ 1: తూత్తుకుడి జిల్లా పరిధిలో 2752 మంది సైనికులు పోస్టల్ ఓట్లు వేసుకునేందుకు అవకాశం కల్పించనున్నారు. ఇందుకోసం ఎన్నికల సంఘం ఏర్పాట్లు చేయనుంది. ఈ జిల్లాలో మొత్తం 2697 మంది పురుషులు, 55 మంది మహిళలు సైనికోద్యోగులుగాను, పారామిలటరీ ఉద్యోగులుగా ఉన్నారు. వీరందరూ ఆయా ప్రాంతాల్లో ఎన్నికల విధుల్లో నిమగ్నమైవున్నారు. ఇలాంటి వారు పోస్టల్ ద్వారా తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు ఎన్నికల సంఘం ఏర్పాట్లు చేసింది. ఇందుకోసం వీరంతా ఎన్నికల సంఘాన్ని అనుమతి కోరుతూ ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకున్నారు.

రంజాన్ వేళలు

మంగళవారం : ఇఫ్తార్ : సాయంత్రం -6.28
బుధవారం : సహర్ : ఉదయం -4.24



సమాచార దర్శిని

ఈ నెలలో 11 సెలవు రోజులు

ప్యారీస్, ఏప్రిల్ 1: ఈ నెలలో మొత్తం 11 సెలవు దినాలుగా ప్రభుత్వం ప్రకటించింది. 9వ తేది తెలుగు సంవత్సరాది, 11న రంజాన్, 14న తమిళ సంవత్సరాది, 21న జైన మతగురువు మహావీర్ జయంతి కావడంతో ఇవి ప్రభుత్వ సెలవు దినాలు కావడం గమనార్హం. ఇవి కాకుండా 19న లోక్‌సభ ఎన్నికల పోలింగ్ సందర్భంగా ప్రభుత్వం సెలవు దినంగా ప్రకటించింది. నాలుగు శని వారాలు, నాలుగు ఆదివారాలతో కలిపి మొత్తం 11 రోజులు సెలవు దినాలు కావడం గమనార్హం.

6.5 లక్షల మందికి ఉచిత ఫిజియోథెరపీ

ఐసిఎఫ్, ఏప్రిల్ 1: రాష్ట్రంలో 'మక్కలై తేడి మరుత్తువం' పథకం ద్వారా 6.5 లక్షల మందికి ఫిజియోథెరపీ చికిత్స ఉచితంగా అందించారు. అలాగే ఇదే పథకం కింద షుగర్, బీపీ బాధితులకు ప్రతినెలా ఇంటింటికీ వెళ్లి మందులు అందిస్తున్నారు. 67.30 లక్షల మంది బీపీ పేషంట్లు, 36.50 లక్షల మంది షుగర్ పేషంట్లు సహా 1.54 కోట్ల మంది చికిత్స పొందుతున్నారు. ఈ నేపథ్యంలో, వృద్ధులు, ప్రమాదాలకు గురైన వారు, మోకాలి నొప్పులతో బాధపడేవారికి ఫిజియోథెరపీ చికిత్స అందించారు. ఉచిత సేవలకు నెం.104లో సంప్రదించాలని ఆరోగ్యశాఖ వెల్లడించింది.

విద్యార్థుల బ్యాంకు ఖాతా వివరాల సేకరణ

ఐసిఎఫ్, ఏప్రిల్ 1: విద్యార్థుల బ్యాంకు ఖాతా వివరాలు సేకరించాలని ప్రధానోపాధ్యాయులకు పాఠశాల విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు వివిధ పథకాల్లో విద్యా ఉపకార వేతనం అందిస్తున్నారు. స్కాలర్‌షిప్ నేరుగా విద్యార్థుల బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తున్నారు. ఈ వివరాల నమోదు ఆన్‌లైన్‌లో జరుగుతోంది. నిర్లక్ష్యంగా వ్యవహరించే హెచ్‌ఎంలపై క్రమశిక్షణ చర్యలు చేపడతామని హెచ్చరించింది.

టోల్ రుసుము వసూలు చేయనున్న పట్టణ పంచాయతీ

ఐసిఎఫ్, ఏప్రిల్ 1: పర్యాటక వాహనాలకు ఇకపై టోల్ రుసుము వసూలు చేసేందుకు మహాబలిపురం పట్టణ పంచాయతీ నిర్ణయించింది. ఇప్పటివరకు ఒప్పంద పద్ధతిలో ప్రైవేటు సంస్థ టోల్ రుసుము వసూలు చేస్తోంది. ఆ సంస్థకు ఇచ్చిన గడువు ఆదివారంతో ముగియడంతో టౌన్ పంచాయతీ టోల్ రుసుము వసూలుకు చర్యలు చేపట్టింది.

పళని ఆలయానికి కొత్త విద్యుత్ బస్సు

ఐసిఎఫ్, ఏప్రిల్ 1: దిండుగల్ జిల్లా పళని మురుగన్ ఆలయానికి కోయంబత్తూర్ చెన్నై సిల్క్స్, కుమరన్ తంగ మాళిగై సంస్థల ఆధ్వర్యంలో రూ.15 లక్షల విలువైన విద్యుత్ బస్సును అందజేశారు. హైకోర్టు మదురై శాఖ ఉత్తర్వుల మేరకు ప్రస్తుతం గిరి వీధిలో వాహనాలను అనుమతించడం లేదు. ఉచిత వాహనాలు నడపాలని ఆలయ అధికారులకు కోర్టు సూచించింది. ఆ ప్రకారం, ఒక బస్సు, బ్యాటరీ కార్లు మాత్రమే నడుస్తున్నాయి. ప్రతిరోజు వేలాది మంది భక్తులు వస్తుండడంతో ఈ వాహనాలు సరిపోవడం లేదు. దీంతో 23 మంది ప్రయాణించేలా రూ.15 లక్షలతో ఎలక్ట్రిక్ బస్సును ఆ రెండు సంస్థలు అందించాయి.

మెట్రోరైళ్లలో 86.82 లక్షల మంది ప్రయాణం

ఐసిఎఫ్, ఏప్రిల్ 1: గత మార్చిలో మెట్రోరైళ్లలో 86.82 లక్షల మంది ప్రయాణించినట్లు సీఎంఆర్ఎల్ తెలిపింది. జనవరిలో 84.63 లక్షల మంది, ఫిబ్రవరి 86.15 లక్షల మంది ప్రయాణించగా, మార్చిలో ఎక్కువ మంది ప్రయాణించారు. గరిష్ఠంగా గత నెల 4వ తేది 3,34,710 మంది ప్రయాణించినట్లు మెట్రోరైలు సంస్థ అధికారులు తెలిపారు.

ప్లస్‌టూ మూల్యాంకనం ప్రారంభం

పెరంబూర్, ఏప్రిల్ 1: ప్లస్ టూ పబ్లిక్ పరీక్షల మూల్యాంకనం సోమవారం నుంచి ప్రారంభమైంది. రాష్ట్ర పాఠ్య ప్రణాళికలో ఈ విద్యా సంవత్సరం ప్లస్‌టూ పబ్లిక్ పరీక్షలు గత నెల 1 నుంచి 22వ తేది వరకు జరగ్గా, 7.8 లక్షల మంది విద్యార్థులు హాజరయ్యారు. ఈ క్రమంలో, ఈ పరీక్షలకు సంబంధించిన మూల్యాంకనం రాష్ట్రవ్యాప్తంగా 83 కేంద్రాల్లో ప్రారంభం కాగా, విధుల్లో 46 వేలమంది పీజీ ఉపాధ్యాయులు పాల్గొంటున్నారు. ఈ నెల 13వ తేది వరకు మూల్యాంకనం పనులు జరుగుతాయని, అనంతరం మార్కుల జాబితా తయారీ, ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ తదితరాలు పూర్తిచేసి, ఇదివరకే ప్రకటించిన విధంగా మే 6వ తేది ఫలితాలు విడుదల చేస్తామని ప్రభుత్వ పరీక్ష శాఖ తెలియజేసింది.

టోల్ రుసుము పెంపు నిలిపివేత

పెరంబూర్, ఏప్రిల్ 1: రాష్ట్రవ్యాప్తంగా సోమవారం నుంచి అమల్లోకి రావాల్సిన టోల్ రుసుము పెంపు హఠాత్తుగా నిలిచిపోయింది. పదేళ్లుగా యేటా ఏప్రిల్ 1 నుంచి టోల్ రుసుము పెంచుతుంటారు. ఆ ప్రకారం, ఈ ఏడాది నగర పరిధిలోని 2 టోల్ గేట్లు సహా రాష్ట్ర వ్యాప్తంగా 7 టోల్ గేట్లలో రుసుము పెంపు సోమవారం నుంచి అమల్లోకి వస్తుందని జాతీయ రహదారుల శాఖ ప్రకటించింది. ఈ పెంపుపై సీఎం స్టాలిన్, లారీ యజమానుల సంఘాలు నిరసన వ్యక్తం చేశాయి. ఈ నేపథ్యంలో, రాష్ట్రంలో టోల్ రుసుము పెంపు నిలిపివేస్తున్నట్లు కేంద్రప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

పెరిగిన చికెన్ ధర

ఐసిఎఫ్, ఏప్రిల్ 1: లోక్‌సభ ఎన్నికల ప్రచారంతో చికెన్ కొనుగోలు ధరలు పెరిగినట్లు ఉత్పత్తిదారులు తెలిపారు. రాష్ట్రంలో వివిధ ప్రాంతాల్లో సుమారు 25 వేల కోళ్ల ఉత్పత్తి ఫారాలున్నాయి. వీటిలో ప్రతిరోజు 15 లక్షల కోళ్ల ఉత్పత్తి చేసి వివిధ జిల్లాలు, పొరుగు రాష్ట్రాలకు విక్రయానికి తరలిస్తున్నారు. ప్రస్తుతం ఎన్నికల ప్రచారాన్ని పురస్కరించుకొని కార్యకర్తలకు బిర్యానీ అందిస్తుండడంతో చికెన్ కొనుగోలు ధరలు పెరిగాయని, గత మార్చి 24వ తేది లైవ్ చికెన్ కిలో రూ.111 ఉండగా, ప్రస్తుతం రూ.270కి పెరిగిందని వ్యాపారులు హర్షం వ్యక్తం చేశారు.

15నుంచి ఇస్కాన్ వేసవి శిబిరం

ఐసిఎఫ్, ఏప్రిల్ 1: ఇస్కాన్ ఆధ్వర్యంలో నగరంలో ఈ నెల 15వ తేది వేసవి ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు కానున్నాయి. షోళింగనల్లూర్ ఈస్ట్‌కోస్ట్ రోడ్డు భక్తి వేదాంత స్వామి రోడ్డులో ఉన్న హరే రామ హరే కృష్ణ (ఇస్కాన్) ఆలయ ఆధ్వర్యంలో 6 నుంచి 12 ఏళ్లలోపు బాలబాలికలకు క్విజ్ పోటీలు, అడవులకు సంబంధించిన కథలు, శ్లోకాలు, భజనలు, నిప్పు లేని వంట, కళ, హస్తకళ శిక్షణ ఇవ్వనున్నారు. అలాగే, 13 నుంచి 17 ఏళ్లలోపు వారికి చర్చా వేదిక విభాగాలు, బోధన విధానం వంటి వాటిపై శిక్షణ ఇవ్వనున్నారు. 15 నుంచి మే 24వ తేది వరకు జరిగే శిబిరాల్లో పాల్గొనేందుకు ఆసక్తి ఉన్న వారు ఇస్కాన్ వెబ్‌సైట్‌లో సంప్రదించాలని నిర్వాహకులు తెలిపారు.

రేపటి నుంచి వైగో ప్రచారం

ఐసిఎఫ్, ఏప్రిల్ 1: ఇండియా కూటమి అభ్యర్థులకు మద్దతుగా ఎండీఎంకే ప్రధాన కార్యదర్శి వైగో ఈనెల 3 నుంచి 16వ తేది వరకు రాష్ట్రవ్యాప్తంగా ప్రచారం చేయనున్నారు. బుధవారం సాయంత్రం 5 గంటలకు దక్షిణ చెన్నై నుంచి ప్రచారం ప్రారంభించనున్నారు.

ప్రజాస్వామ్యం, లౌకికవాదం కాపాడుకొనే ఎన్నికలు

● రాష్ట్రంపై మోదీ సవతి తల్లి ప్రేమ ● మదురై ఎన్నికల ప్రచారంలో నటి రోహిణి

పెరంబూర్, ఏప్రిల్ 1: దేశంలో ప్రజాస్వామ్యం, లౌకికవాదాన్ని కాపాడుకొనే ముఖ్యమైన ఎన్నికలని, ప్రజలు ఆలోచించి ఓటు వేయాలని సినీ నటి రోహిణి పిలుపునిచ్చారు. మదురై నియోజకవర్గంలో డీఎంకే కూటమి తరఫున పోటీ చేస్తున్న సీపీఎం అభ్యర్థి వెంకటేశన్‌కు మద్దతుగా సోమవారం మదురైలోని జైహిద్‌పురం, డిడీర్ నగర్, చొక్కలింగ నగర్ ప్రాంతాల్లో ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... పార్లమెంటులో సామాన్యుల గొంతు వినిపించాలంటే కమ్యూనిస్టుల బలం పెరగాల్సిన అవసరం ఉందన్నారు. ప్రస్తుత అభ్యర్థి వెంకటేశన్ సామాన్యుల వర్గం నుంచి వచ్చిన వారని, ఆయనను మళ్లీ గెలిపించుకోవాలని అభ్యర్థించారు. 400 నియోజకవర్గాల్లో విజయం సాధిస్తామని ప్రధాని మోదీ చెప్పుకుంటున్నారని, ఆ విషయం నిర్ణయించేది ప్రజలేనని అన్నారు. రాష్ట్రం తుఫాను, భారీ వర్షాలతో అల్లాడిన తరుణంలో రాని ప్రధాని, ప్రస్తుతం ఎన్నికల సందర్భంగా తరచూ రాష్ట్రానికి వస్తున్నారని అన్నారు. ఎలక్టోరల్ బాండ్ల ద్వారా బీజేపీ వేల కోట్ల అవినీతికి పాల్పడిందన్నారు. తమిళనాడు సహా దక్షిణాది రాష్ట్రాల్లో 'ఇండియా' కూటమి భారీ విజయాలు నమోదు చేస్తుందన్నారు. పార్టీ రాష్ట్ర



కార్యదర్శివర్గ సభ్యుడు నూర్ మహమ్మద్, జిల్లా కార్యదర్శి ఎం.గణేశన్, రాష్ట్ర కమిటీ సభ్యులు ఆర్.విజయరాజన్, డిప్యూటీ మేయర్ టి.నాగరాజన్, జిల్లా కమిటీ సభ్యులు ఎస్.తమిళ్‌సెల్వన్, ఆదవన్, శాంతారాం తదితరులు పాల్గొన్నారు.

సీపీఐకి ఆలయ స్థల నివాసుల సంఘాల సమాఖ్య విరాళం

చెన్నై, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఆలయ స్థల నివాసుల సంఘాల సమాఖ్య నిర్వాహకులు సీపీఐ రాష్ట్ర కమిటీ కార్యదర్శి ముత్తరసన్‌ను కలుసుకుని రూ.80వేలను విరాళంగా అందజేశారు. తమ సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడుతున్న సీపీఐకి ఎన్నికల సందర్భంగా విరాళం అందిస్తున్నట్లు సమాఖ్య అధ్యక్షుడు వీఏ బాలసుబ్రమణియన్ తెలిపారు. గత అన్నాడీఎంకే ప్రభుత్వం ఆలయ స్థల నివాసుల అద్దెలను విపరీతంగా పెంచిందని, ముఖ్యమంత్రిగా కరుణానిధి హయాంలో అద్దెలను క్రమబద్ధీకరిస్తూ జారీ చేసిన జీవో 456/298ను ఉత్తర్వును మళ్లీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ స్థల నివాసుల సంఘాల సమాఖ్య కోశాధికారి ఎస్.ఏళుమలై, సభ్యులు డి.శశికుమార్, ఎస్. కన్నన్, ఉత్తర చెన్నై జిల్లా శాఖ అధ్యక్షుడు డి.కామరాజ్, కార్యదర్శి సెంథిల్ సెల్వం, సెల్వరాఘవన్, తిరువళ్లూరు జిల్లా శాఖ అధ్యక్షుడు కే.ఈ.ఆనందన్, హిందూ దేవాదాయ ఆలయాల అద్దెవాసుల సంఘం కార్యదర్శి గోవిందరాజు, నుంగంబాక్కం శాఖ కార్యదర్శి బృహదీశ్వరన్, మందవెల్లి సుందర వినాయకర్ ఆలయ నిర్వాహకులు పాల్గొన్నారు.

చెన్నై-అరక్కోణం మధ్య అదనపు మెమో రైలు

పెరంబూర్, ఏప్రిల్ 1: స్థానిక మూర్‌మార్కెట్ కాంప్లెక్స్ నుంచి అరక్కోణంకు అదనపు మెమో రైలు నడపనున్నట్లు దక్షిణ రైల్వే ఒక ప్రకటనలో తెలిపింది. మూర్ మార్కెట్ కాంప్లెక్స్ నుంచి ఉదయం 10.30 గంటలకు బయల్దేరే రైలు మధ్యాహ్నం 12 గంటలకు అరక్కోణం చేరుకుంటుంది. మరో మార్గంలో అరక్కోణం నుంచి మధ్యాహ్నం 2.25 గంటలకు బయల్దేరి సాయంత్రం 4.05 గంటలకు మూర్ మార్కెట్ కాంప్లెక్స్ చేరుకుంటుంది. ఈ రైళ్లు బేసిన్ బ్రిడ్జి, పెరంబూర్, విల్లివాక్కం, అంబత్తూర్, ఆవడి, తిరునిన్రవూర్, తిరువళ్లూర్, కడంబత్తూర్, తిరువాలంగాడు స్టేషన్‌లో ఆగుతాయి. మంగళవారం నుంచి ప్రారంభం కానున్న ఈ రైళ్ల సేవలు సోమవారం నుంచి శుక్రవారం వరకు అందుబాటులో ఉంటాయని దక్షిణ రైల్వే తెలియజేసింది.

రాష్ట్రంలో ఇప్పటివరకు రూ.109.76 కోట్ల స్వాధీనం

పెరంబూర్, ఏప్రిల్ 1: రాష్ట్రంలో గత నెల 31వ తేది వరకు రూ.109.76 కోట్ల విలువైన నగదు, బహుమతులు స్వాధీనం చేసుకున్నట్లు రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రకటించింది. కోడ్ అమల్లోకి వచ్చిన నేపథ్యంలో తగిన రసీదులు లేకుండా రూ.50 వేల కంటే అధిక నగదు, బంగారం, వెండి వస్తువులు తీసుకెళ్లే సందర్భాల్లో ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు వాటిని స్వాధీనం చేసుకుంటున్నారు. అలాగే, సి-విజిల్ యాప్ ద్వారా 1,822 ఫిర్యాదులు అందగా 1,803 ఫిర్యాదులను పరిష్కరించినట్లు ఎన్నికల సంఘం తెలియజేసింది.

ఎన్నికల కోడ్ పేరుతో జల్లికట్టు పోటీలకు అనుమతి నిరాకరణ

● హైకోర్టు అసంతృప్తి

పెరంబూర్, ఏప్రిల్ 1: ఎన్నికల కోడ్ పేరుతో జల్లికట్టు పోటీలకు అనుమతి నిరాకరించడంపై హైకోర్టు మదురై డివిజన్ బెంచ్ అసంతృప్తి వ్యక్తం చేసింది. ఆలయ ఉత్సవాల్లో భాగంగా జల్లికట్టు పోటీల నిర్వహణకు ఎన్నికల నిబంధనలకు సంబంధం లేదని పేర్కొన్న న్యాయస్థానం, పోటీల అనుమతులపై మంగళవారంలోగా కలెక్టర్ నిర్ణయం తీసుకోవాలని న్యాయస్థానం ఆదేశించింది. శివగంగ జిల్లా కొట్టూరులో నిర్వహించదలచిన జల్లికట్టు పోటీలకు జిల్లా యంత్రాంగం ఎన్నికల నిబంధనలు కారణం చూపి అనుమతులు నిరాకరించిందని హైకోర్టు మదురై డివిజన్ బెంచ్‌లో ప్రజావ్యాజ్యం దాఖలైంది.

డీఎంకే అభ్యర్థికి మద్దతుగా సీపీఐ ప్రచారం



ప్రచారంలో ముత్తరసన్ తదితరులు

వేలూరు, ఏప్రిల్ 1: వేలూరు లోక్‌సభ నియోజకవర్గంలో డీఎంకే అభ్యర్థిగా పోటీ చేస్తున్న కదిర్ ఆనంద్‌కు మద్దతుగా సీపీఐ నేతలు సోమవారం ప్రచారంలో పాల్గొన్నారు. స్థానిక సాయినాథపురం, విరుపాక్షిపురం ప్రాంతాల్లో ఇంటింటి ప్రచారం చేపట్టి, ఉదయించే సూర్యుడు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి ముత్తరసన్ మాట్లాడుతూ... మతవాద బీజేపీకి ప్రజలు గుణపాఠం చెప్పాలన్నారు. ఎలక్టోరల్ బాండ్ల ద్వారా వేలకోట్లు సంపాదించిన బీజేపీ, ఈ వాస్తవాన్ని కప్పిపుచ్చేలా ప్రతిపక్ష నేతలను జైళ్లకు పంపడం, వారిపై ఐటీ, ఈడీ, సీబీఐ సంస్థలచే దాడులు చేయిస్తోందని మండిపడ్డారు. ప్రచారంలో జిల్లా కార్యదర్శి లత, నిర్వాహకులు మణి సహా నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆరేళ్ల బాలికకు లైంగిక వేధింపులు

● నిందితుడికి 20 ఏళ్ల జైలు

పెరంబూర్, ఏప్రిల్ 1: ఆరేళ్ల బాలికపై లైంగిక వేధింపులకు పాల్పడిన నిందితుడికి న్యాయస్థానం 20 ఏళ్ల జైలు శిక్ష విధించింది. 2022 ఆగస్టు 21వ తేది 2వ తరగతి చదువుతున్న ఆరేళ్ల బాలికను లైంగికంగా వేధించినట్టు ఓ వ్యక్తిపై చిన్నారి తల్లిదండ్రులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేశారు. ఈ ఫిర్యాదును విచారించిన పోలీసులు, పోక్సో తదితర చట్టాల కింద కేసు నమోదు చేసి సదరు వ్యక్తిని అరెస్ట్ చేశారు. ఈ కేసు పూర్వాపరాలను పరిశీలించిన జడ్జి సోమవారం తీర్పు వెలువరించారు. బాలికపై లైంగిక వేధింపులకు పాల్పడిన వ్యక్తికి 20 ఏళ్ల జైలు శిక్ష, రూ.25 వేల జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు. అలాగే బాలికకు రాష్ట్రప్రభుత్వం రూ.4 లక్షలు పరిహారం ఇవ్వాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

రికార్డు స్థాయిలో ఐసీఎఫ్ ఉత్పత్తి

● గత యేడాది రికార్డు బద్దలు



కార్మికులకు స్వీట్లు పంపిణీ చేస్తున్న ఐసీఎఫ్ జీఎం సుబ్బారావు

అడయార్, ఏప్రిల్ 1: స్థానిక పెరంబూరులోని ఇంటిగ్రల్ కోచ్ ఫ్యాక్టరీ (ఐసీఎఫ్) రైలు పెట్టెల తయారీలో సరికొత్త రికార్డులను నెలకొల్పుతోంది. గత యేడాది ఉత్పత్తితో పోల్చితే ఈ సంవత్సరం సరికొత్త రికార్డును నెలకొల్పింది. 2022-23 సంవత్సరంలో 2702 రైలు బోగీలను తయారు చేయగా, ఆ సంఖ్య 2023-24లో 2829గా ఉందని పేర్కొంది. అదేవిధంగా 2018-19లో డిస్ట్రిబ్యూటెడ్ పవర్ రోలింగ్ స్టాక్‌లు 996ని ఉత్పత్తి చేయగా, ప్రస్తుతం ఈ సంఖ్య 1091కు పెరిగిందని తెలిపారు. డీపీఆర్ఎస్ టైప్ కోచ్‌లలో వందే భారత్, ఈఎంయు, ఎంఈఎంయు వంటి బోగీలు ఉన్నట్టు వివరించింది. అదేవిధంగా 2023-24లో ఐసీఎఫ్ సాధించిన ప్రగతిని పరిశీలిస్తే, అత్యధికంగా 51 వందే భారత్ బోగీలను తయారు చేసింది. అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్ల కోసం 22 కోచ్‌ల 2 రేక్‌లను, అన్ రిజర్వుడు కోచ్‌లలో మెరుగైన సౌకర్యాలతో బోగీలను తయారు చేసినట్టు పేర్కొంది. జోనల్ రైల్వేలలో భద్రతా తనిఖీల కోసం అత్యధిక సంఖ్యలో 19 స్వీయ చోదక తనిఖీ కార్లను తయారు చేశారు. లక్నోలోని ఆర్‌డీఎస్‌వో కోసం తొలి ఓసిల్లో గ్రాఫ్ మానిటరింగ్ కారును తయారు చేసినట్టు ఐసీఎఫ్ జనరల్ మేనేజర్ యు.సుబ్బారావు పేర్కొన్నారు. అలాగే, రికార్డు స్థాయిలో ఉత్పత్తి సాధించినందుకు సిబ్బందికి ఆయన స్వీట్లు పంచిపెట్టారు.

6న గాంధీ నగర్ లేడీస్ క్లబ్ ఆధ్వర్యంలో ఉగాది వేడుకలు

అడయార్, ఏప్రిల్ 1: గాంధీనగర్ లేడీస్ క్లబ్, వరల్డ్ తెలుగు ఫెడరేషన్ సంయుక్తంగా ఈనెల 6వ తేదీన శనివారం తెలుగు, తమిళ సంవత్సర ఉగాది వేడుకలు జరగనున్నాయి. అడయారు, గాంధీనగర్, రామచంద్ర ఆదిత్యనార్ సాలైలో ఉన్న గాంధీ నగర్ లేడీస్ క్లబ్ రెండో అంతస్తులో ఈ వేడుకలను నిర్వహించనున్నారు. జీఎన్ఎల్‌సీ, డబ్ల్యూటీఎఫ్ అధ్యక్షురాలు డాక్టర్ వీఎల్ ఇందిరా దత్తు పర్యవేక్షణలో ఉదయం 10.30 నుంచి సాయంత్రం 6.30 గంటల వరకు జరగనున్నాయి. ఈ వేడుకల్లో భాగంగా ఆనంది మోహన్ పంచాంగ పఠనం, కైకైవల్య భక్తిగీతాలాపన కార్యక్రమం ఉంటుంది. ఆ తర్వాత మహిళా పారిశ్రామికవేత్తల ఆధ్వర్యంలో ఎగ్జిబిషన్ కమ్ సేల్ నిర్వహిస్తారు. సమ్మర్ ఎసెన్షియల్స్ కాటన్ శారీస్, మెటీరియల్స్, ఫ్యాన్సీ జ్యూవెలరీ, హోమ్‌మేడ్ పికెల్స్ వంటి అనేక వస్తు ఉత్పత్తులను విక్రయిస్తారు. ఈ ఎగ్జిబిషన్ అదే భవనంలోని మొదటి అంతస్తులో ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 6.30 గంటల వరకు కొనసాగుతుంది. ఈ ప్రదర్శనను ప్రముఖ మహిళా పారిశ్రామికవేత్త, వీజీఎన్ హోమ్స్ ప్రైవేట్ లిమిటెడ్ డైరెక్టర్ పద్మ దేవదాస్ ప్రారంభిస్తారు.

బ్రాహ్మణ సంఘ పంచాంగం ఆవిష్కరణ



వేలూరు, ఏప్రిల్ 1: వేలూరు బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో సోమవారం పంచాంగం ఆవిష్కరణ జరిగింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆడిటర్ గాయత్రిదేవి పాల్గొని పంచాంగాన్ని ఆవిష్కరించగా, తొలి ప్రతిని సంఘ అధ్యక్షుడు రాజా అందుకున్నారు. ఈ సందర్భంగా రాజా మాట్లాడుతూ... ఈ పంచాంగంలో తిథులు, వారాలు, నక్షత్రాలు, శుభ ముహూర్తాలను ముద్రించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘ ఆర్గనైజర్లు కృష్ణమూర్తి, సుబ్రమణి, ఉపాధ్యక్షుడు వెంకట్, ఉప సెక్రటరీ విజయరాఘవన్, మహిళా సెక్రటరీ లలిత కృష్ణమూర్తి, మహిళా శాఖ జాయింట్ సెక్రటరీలు మాలతి సత్యమూర్తి, రాధామణి తదితరులు పాల్గొన్నారు.

ఐటీ చర్యలను నిరసిస్తూ కాంగ్రెస్ ఆందోళన

వేలూరు, ఏప్రిల్ 1: కాంగ్రెస్ పార్టీ రూ.1,700 కోట్ల పన్ను చెల్లించాలనే ఐటీ నోటీసు జారీ చేయడాన్ని నిరసి స్తూ ఆ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం ఆందోళన చేపట్టారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు టీకా రామన్ నేతృత్వంలో జరిగిన ఆందోళనలో రాష్ట్ర జనరల్ కమిటీ సభ్యుడు ప్రసన్నకుమార్, మండల అధ్యక్షుడు వశిష్టర్, ఎస్సీ విభాగం అధ్యక్షుడు వాహిత్‌బాషా సహా పలువురు నేతలు, పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొని, బీజేపీ, ఐటీలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

ఎన్నికల ఖర్చుల పర్యవేక్షణ అధికారులతో కలెక్టర్ భేటీ



సమావేశంలో ప్రసంగిస్తున్న సుబ్బులక్ష్మి

వేలూరు, ఏప్రిల్ 1: స్థానిక కలెక్టర్ కార్యాలయంలో సోమవారం జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సుబ్బులక్ష్మి ఎన్నికల ఖర్చుల పర్యవేక్షణ అధికారులతో సమావేశమయ్యారు. అభ్యర్థుల వ్యయ వివరాలు సక్రమంగా నమోదు చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. సమావేశంలో అడిషనల్ ఎన్నికల అధికారి బాలాజి, జిల్లా గ్రామీణాభివృద్ధి పథక డైరెక్టర్ ఆర్తీ, జిల్లా కలెక్టర్ పీఏ (ఎన్నికలు) సెల్వరసు, ఎన్నికల అధికారులు కవిత, సుబ్బులక్ష్మి, అజీత్ బేగం, అధికారులు పాల్గొన్నారు.

కొడైకెనాల్ లోయలో పడ్డ యువకుడు

కాపాడిన అగ్నిమాపక దళం

చెన్నై, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): కొడైకెనాల్‌కు విహారయాత్రగా వెళ్లిన తూత్తుకుడికి చెందిన ధనరాజన్ అనే వ్యక్తి అక్కడి డాల్ఫిన్ నోస్ ప్రాంతంలో వాకింగ్ చేస్తూ వంద దుగుల లోతు లోయలో జారి ప డ్డారు. గమనించిన పర్యాటకులు అగ్నిమాపక దళానికి ఫిర్యాదు చేశారు. ఆ సమాచారం అందుకున్న పోలీసులు, అగ్నిమాపక సభ్యులు అక్కడికి హుటాహుటిన వెళ్లి మూడు గంటలపాటు శ్రమించి ధనరాజన్‌ను పైకి తీసుకొచ్చి చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు.





వేలూరులో బీజేపీ కూటమి తరఫున పోటీ చేస్తున్న పుదియ నీతి కట్చి అధ్యక్షుడు ఏసీ షణ్ముగం సోమవారం వేలూరు, తిరుపత్తూర్, వాణియంబాడికి చెందిన ముస్లిం పెద్దలను కలుసుకొని ఆశీస్సులు పొందుతున్న దృశ్యం

ఈ ఎన్నికలతో కుటుంబపాలనకు చరమగీతం

● రాణిపేట సభలో ఈపీఎస్

చెన్నై, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికలలో డీఎంకే ఓటమి తథ్యమని, ఎన్నికల తర్వాత రాష్ట్రంలో కుటుంబ పాలన అంతమవుతుందని అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి, మాజీ ముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామి అన్నారు. రాణిపేటలో అన్నాడీఎంకే కూటమి అభ్యర్థులకు మద్దతుగా ఏర్పాటైన ప్రచార సభలో సోమవారం సాయంత్రం ఆయన ప్రసంగిస్తూ ముఖ్యమంత్రి స్టాలిన్‌కు, ఆయన తనయుడు మంత్రి ఉదయనిధి స్టాలిన్‌కు ఈ ఎన్నికల్లో ఓడిపోతామనే భయం పట్టుకుందన్నారు. అన్నాడీఎంకే ప్రభుత్వ హయంలో డీఎంకే నేతలపై, మాజీ మంత్రులపై ఎలాంటి కేసులు వేయలేదని, ప్రజా సంక్షేమంపైనే దృష్టి సారించామని చెప్పారు. డీఎంకే అధికారంలోకి వచ్చాక రాష్ట్రం ఆర్థికంగా బాగా వెనుబడిందన్నారు. రాష్ట్రంలో దోపిడీలు, దొంగతనాలు అధికమయ్యాయని, శాంతి భద్రతలు కూడా క్షీణించాయని ఈపీఎస్ అన్నారు.

మంత్రి కేకేఎస్‌ఎస్‌ఆర్‌కు అస్వస్థత



అడయార్, ఏప్రిల్ 1: రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి కేకేఎస్ఎస్ఆర్ రామ చంద్రన్ అస్వస్థతకు లోనయ్యారు. దీంతో ఆయన్ను థౌజండ్‌లైట్స్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా, ముఖ్యమంత్రి స్టాలిన్‌తో పాటు రాష్ట్ర మంత్రులు డీఎంకే కూటమి అభ్యర్థుల గెలుపు కోసం రాష్ట్రంలో విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. ఆ కోవలోనే మంత్రి రామచంద్రన్ కూడా కొన్ని రోజులుగా ప్రచారం చేస్తున్నారు. ఈ క్రమంలోనే ఆయన ఆదివారం ఉన్నట్టుండి అస్వస్థతకు లోనయ్యారు. ఆ వెంటనే ఆయనను అపోలో ఆస్పత్రిలో చేర్పించి చికిత్స అందిస్తున్నారు. అయితే, ఆయనకు హృద్రోగ సమస్య ఉన్నట్టు గుర్తించి, దీనికి చికిత్స అందించాలని వైద్యులు భావిస్తున్నట్టు వార్తలు వస్తున్నాయి. అయితే, ఆస్పత్రి వైద్యులు మాత్రం మంత్రి ఆరోగ్యంపై ఎలాంటి మెడికల్ బులెటిన్‌ను విడుదల చేయలేదు.

ఎన్నికల విధుల కోసం మరో 165 కంపెనీల పారామిలటరీ బలగాలు

అడయార్, ఏప్రిల్ 1: ఈ నెల 19న జరగనున్న లోక్‌సభ ఎన్నికల బందోబస్తు కోసం మరో 165 కంపెనీ పారామిలటరీ బలగాలను రాష్ట్రానికి కేంద్రం పంపించింది. ఏడు దశల లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్‌లో భాగంగా తమిళనాడులో తొలి దశలోనే పోలింగ్ జరగనున్న విషయం తెల్సిందే. ఎన్నికల బందోబస్తు కోసం ఇప్పటికే 25 కంపెనీల పారామిలటరీ బలగాలు రాష్ట్రానికి రాగా, ఇపుడు మరో 165 కంపెనీల బలగాలు రాష్ట్రానికి వచ్చాయి. ఈ బలగాలను రాష్ట్రంలోని 39 లోక్‌సభ స్థానాలకు విభజించి పంపనున్నారు. ఏయే నియోజకవర్గాలకు ఏ మేరకు పారా మిలిటరీ బలగాలను పంపాలన్న అంశంపై ఎన్నికల సంఘం రాష్ట్ర ముఖ్యాధికారి సత్యప్రద సాహు ఉన్నతాధికారులతో చర్చించి ఒక నిర్ణయం తీసుకోనున్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఉన్న సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించే పనిలో ఎన్నికల సిబ్బంది నిమగ్నమైవుంది.

మోదీకి తమిళం నేర్పేందుకు టీచర్‌ను పంపిస్తాం

● తూత్తుకుడి ప్రచారంలో డీఎంకే ఎంపీ కనిమొళి

ప్యారీస్, ఏప్రిల్ 1: ప్రధాని నరేంద్రమోదీకి తమిళం నేర్పేందుకు టీచర్‌ను పంపిస్తామంటూ తూత్తుకుడి ప్రచారంలో డీఎంకే ఎంపీ కనిమొళి ఎద్దేవా చేశారు. ఇండియా కూటమి నుంచి తూత్తుకుడి లోక్‌సభ స్థానంలో ఈసారి కూడా కనిమొళి డీఎంకే అభ్యర్థిగా పోటీ చేస్తున్నారు. ఆమె కోవిల్‌పట్టి అసెంబ్లీ నియోజకవర్గంలో ఆదివారం ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... బీజేపీ అధికారంలో లేని రాష్ట్రాల పట్ల కేంద్రప్రభుత్వం సవతి తల్లి ప్రేమ ప్రదర్శిస్తోందని, నిధిగా రూపాయి చెల్లిస్తే కేంద్రం తమిళనాడుకు 25 పైసలు మాత్రమే పంపిణీ చేస్తోందని విమర్శించారు. రాష్ట్రంలో పర్యటనకు వస్తున్న ప్రధాని నరేంద్రమోదీ తమిళ భాష అంటే తనకు ఎనలేని ప్రేమ అని, తమిళ సంస్కృతిని విదేశీ వేదికల్లో ప్రస్తావిస్తున్నానని చెబుతున్నారని, ఆయనకు చక్కని తమిళ భాష నేర్పించగలిగిన టీచర్‌ను తప్పకుండా ఏర్పాటు చేస్తామని కనిమొళి చమత్కరించారు.

అన్నాడీఎంకేకు ఊపిరి పోసింది మేమే

● పీఎంకే అధ్యక్షుడు అన్బుమణి రాందాస్

అడయార్, ఏప్రిల్ 1: పీఎంకే తమకు ద్రోహం చేసిందంటూ అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి, మాజీ సీఎం ఈపీఎస్ చేసిన వ్యాఖ్యలకు పీఎంకే అధ్యక్షుడు డాక్టర్ అన్బుమణి రాందాస్ దీటుగా కౌంటరిచ్చారు. చనిపోతున్న అన్నాడీఎంకేకు ఆక్సిజన్‌లా ఊపిరి పోసింది పీఎంకే అని చెప్పారు. కొళత్తూరులో ఆయన ఎన్నికల ప్రచారం సాగించారు. అన్నాడీఎంకే కష్టాల్లో చిక్కుకున్న ప్రతిసారీ పీఎంకే ప్రాణవాయువులా పని చేసిందన్నారు. అవినీతి కేసులో జయకు జైలు శిక్ష పడినపుడు ఇక అన్నాడీఎంకే పని అయిపోయిందని ప్రతి ఒక్కరూ వ్యాఖ్యానించారన్నారు. రెండేళ్ల తర్వాత జరిగిన ఎన్నికల్లో పీఎంకేతో అన్నాడీఎంకే పొత్తు పెట్టుకుని 39 లోక్‌సభ స్థానాల్లో ఏకంగా 30 గెలిచిందని గుర్తు చేశారు. 2019లో తమ పార్టీ అండ లేకుంటే ఎడప్పాడి పళనిస్వామి ముఖ్యమంత్రి కుర్చీలో కూర్చునేవారా అని ఆయన ప్రశ్నించారు. ఆ తర్వాత జరిగిన ఉప ఎన్నికల్లో 22 స్థానాలకు గాను 9 స్థానాల్లో అన్నాడీఎంకే విజయం సాధించగా, అందులో 5 సీట్లలో పీఎంకే ఓటర్ల కారణంగా గెలుచుకున్నారని తెలిపారు.

డీఎంకే ఎమ్మెల్యే కారు తనిఖీ చేయని అధికారి సస్పెన్షన్

ప్యారీస్, ఏప్రిల్ 1: శంకరన్‌కోయిల్ డీఎంకే ఎమ్మెల్యే రాజా కారును తనిఖీ చేయని ఫ్లయింగ్ స్క్వాడ్‌కు చెందిన అధికారిపై సస్పెన్షన్ వేటుపడింది. ఎన్నికల కోడ్ అమలులో ఉన్న కారణంగా తెన్‌కాశి జిల్లావ్యాప్తంగా ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు పలు బృందాలుగా ఏర్పడి వాహన తనిఖీలు చేపట్టారు. ఆ రీతిలో ఎమ్మెల్యే రాజా కారును తనిఖీ చేయకుండా పంపివేశారని జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారి కమల్‌కిషోర్‌కు ఫిర్యాదు అందింది. ఈ వ్యవహారంపై విచారణ అనంతరం విధి నిర్వహణలో నిర్లక్ష్యం చూపిన శంకరన్‌కోయిల్ డీఆర్వో రాధను సస్పెండ్ చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు.

సీఎం రంగస్వామి ప్రచార వాహనంపై రాళ్లు

అడయార్, ఏప్రిల్ 1: పుదుచ్చేరి లోక్‌సభ ఎన్నికల్లో ఎన్డీయే కూటమి అభ్యర్థిగా బీజేపీ నేత నమశ్శివాయం పోటీ చేస్తున్నారు. ఆయన తరపున ముఖ్యమంత్రి ఎన్.రంగస్వామి ప్రచారం చేస్తున్నారు. ఓపెన్ టాప్ జీపులో ఆదివారం ముత్యాలపేట నియోజకవర్గంలో ప్రచారం చేస్తుండగా, గుర్తు తెలియని వ్యక్తులు ఆయన జీపుపై రాళ్లు విసిరారు. నియోజకవర్గంలోని మారియమ్మన్ ఆలయం సమీపంలో వస్తుండగా, ఈ రాళ్లుపడ్డాయి. దీంతో కొద్దిసేపు ఉద్రిక్తత నెలకొంది. అయినప్పటికీ ఆయన తన ప్రచారాన్ని ఆపకుండా కొనసాగించారు.

డీఎంకే అభ్యర్థిని ప్రశ్నించిన వ్యక్తి అరెస్ట్

వేలూరు, ఏప్రిల్ 11: డీఎంకే అభ్యర్థిని ప్రశ్నించినందుకు ఓ వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. వేలూరు లోక్‌సభ నియోజకవర్గ డీఎంకే అభ్యర్థి కదిర్ ఆనంద్ సోమవారం సత్తువాచ్చేరిలో ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఆర్టీఓ కార్యాలయం సమీపంలో సురేష్ అనే వ్యక్తి... ఐదేళ్లుగా ఈ ప్రాంతానికి ఏమీ చేయలేదని, ఇప్పుడు ఓట్ల కోసం వచ్చారా అంటూ ప్రశ్నించాడు. డీఎంకే కార్యకర్తలు వెంటనే అతడిని రోడ్డు పక్కకు తోసేశారు. అనంతరం నేతల ఫిర్యాదుతో పోలీసులు సురేష్‌ను విచారించేందుకు స్టేషన్‌కు తీసుకెళ్లారు.

ఉద్యోగాల పేరుతో రూ.1.11 కోట్ల మోసం

● ముగ్గురిపై కేసు

ప్యారీస్, ఏప్రిల్ 1: తేని జిల్లాలో ప్రభుత్వ ఉద్యోగాలు ఇప్పిస్తామని 33 మందిని నమ్మించి రూ.1.11 కోట్ల మోసం చేసిన ఇద్దరు మహిళలు సహా ముగ్గురిపై కేసు నమోదైంది. పెరియకుళం తెన్‌కరైకి చెందిన బీఈ పట్టభద్రుడు సుందర విఘ్నేష్ హోసూరులోని ఓ ప్రైవేటు సంస్థలో పని చేస్తున్నాడు. 2018-20 వరకు అతని సోదరి దివ్య, ఆమె మిత్రులు సెల్వరాధ కూడా తేనిలో ఉన్న ఓ ప్రైవేటు పాఠశాలలో టీచర్లుగా పని చేస్తున్నారు. అదే పాఠశాలలో కనకదుర్గ కుమారుడు 5వ తరగతి చదువుతున్నాడు. సెల్వరాధ, కనకదుర్గ స్నేహితులయ్యారు. ఈ నేపథ్యంలో, తాను మదురై పాఠశాల విద్యాశాఖ కార్యాలయంలో జేడీగా పనిచేస్తున్నానని, తనకు పలువురు ప్రభుత్వ అధికారులతో పరిచయాలున్నాయని, రూ.10 లక్షలు ముట్టచెబితే సర్కారు బడిలో కంప్యూటర్ ఆపరేటర్‌గా, టీచర్ రిక్రూట్‌మెంట్ బోర్డు ద్వారా టీచరు ఉద్యోగాలిప్పిస్తామంటూ చెప్పింది. ఆమె మాటలు నమ్మిన సెల్వరాధ సహా మరి కొంతమంది ప్రభుత్వ ఉద్యోగాలు వస్తాయన్న నమ్మకంతో కనకదుర్గ బ్యాంక్ ఖాతాలో రూ.1.11 కోట్లు జమ చేశారు. అయితే రోజులు గడుస్తున్నా తమకు ఉద్యోగాలు రాకపోవడంతో అనుమానించిన 33 మంది బాధితులు పెరియకుళం పోలీస్‌స్టేషన్‌లో అందజేసిన ఫిర్యాదు ఆధారంగా కనకదుర్గ, సూర్య, శరణ్యపై క్రిమినల్ కేసు నమోదైంది.

గుట్కా తరలించిన ఆంధ్రా యువకుల అరెస్ట్

ప్యారీస్, ఏప్రిల్ 1: ఆవడి ప్రాంతంలో వాహనాల తనిఖీ చేసిన పోలీసులు ఆంధ్ర రాష్ట్రం చిత్తూరుకు చెందిన రవి, సత్యరాజ్‌ను అరెస్ట్ చేశారు. ఆవడి నియోజకవర్గ సరిహద్దుల్లో ఉన్న వెల్లవేడు-తిరుమనం రహదారిలో ఆదివారం పోలీసులు వాహన తనిఖీలు చేపట్టారు. అటుగా వచ్చిన లగేజీ వాహనాన్ని తనిఖీ చేయగా అందులో నిషేధిత పొగాకు ఉత్పత్తులున్నట్లు గుర్తించారు. గోనె సంచుల్లోని 580 కిలోల ఉత్పత్తులను స్వాధీనం చేసుకుని నిందితులను అరెస్ట్ చేసి కోర్టు ఉత్తర్వుల మేరకు రిమాండ్‌కు తరలించారు.

రూ.24 లక్షల బంగారం స్వాధీనం

పెరంబూర్, ఏప్రిల్ 1: మదురై విమానాశ్రయంలో అక్రమంగా తరలిస్తున్న రూ.24 లక్షల విలువైన బంగారాన్ని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. దుబాయ్ నుంచి మదురైకి వచ్చిన ప్రయాణికులను తనిఖీ చేస్తున్న అధికారులు, ఒకరిని అనుమానించి ప్రత్యేక గదిలోకి తీసుకెళ్లి స్కాన్ చేశారు. అతని కడుపులో 16 క్యాప్సూల్స్ ఉండడాన్ని గమనించి వాటిని స్వాధీనం చేసుకొని అతన్ని విచారిస్తున్నారు.

తిరుచ్చి కోటలో దురై వైగో పాగా వేసేనా?



డీఎండీకే అభ్యర్థి దురైవైగో, అన్నాడీఎంకే అభ్యరి పి.కరుపయ్యా, అమ్మా మక్కల్ మున్నేట్ర కళగం అభ్యర్థి సెంథిల్‌నాథన్, ఎన్‌టీకే అభ్యర్థి రాజేష్

చెన్నై, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): రాక్‌ఫోర్ట్ సిటీగా పేరుగాంచిన తిరుచ్చి లోక్‌సభ నియోజకవర్గంలో ఎండీఎంకే ముఖ్య కార్యదర్శి వైగో తనయుడు దురై వైగో పోటీ చేయడంతో ఈ నియోజకవర్గం వీవీపీ నియోజకవర్గ హోదాను సంతరించుకుంది. తన తనయుడిని పోటీ చేయించడానికి వైగో డీఎంకే అధిష్ఠానంపై తీవ్ర ఒత్తిడి చేసిమరీ ఈ నియోజకవర్గాన్ని పొందారు. ఈ నియోజకవర్గం పరిధిలో తిరుచ్చి జిల్లాలోని శ్రీరంగం, తిరువెరుంబూరు, తిరుచ్చి ఈస్ట్, తిరుచ్చి వెస్ట్, పుదుకోట జిల్లాలోని గంధర్వకోట (రిజర్వుడు), పుదుకోట అంటూ 6 శాసనసభ నియోజకవర్గాలున్నాయి. 2019లో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో డీఎంకే కూటమిలో కాంగ్రెస్ తరఫున పోటీ చేసిన ఎస్. తిరునావుక్కరసు 6,21,285 ఓట్లు పొంది గెలిచారు. అన్నాడీఎంకే కూటమి తరఫున పోటీ చేసిన డీఎండీకే అభ్యర్థి వి.ఇళంగోవన్ 1,61,999 ఓట్లతో ద్వితీయ స్థానం దక్కించుకున్నారు. ఏఎంఎంకే అభ్యర్థి చారుబాల తొండైమాన్ 1,00,818 ఓట్లు, ఎన్టీకే అభ్యర్థి వి.వినోద్ 65,286 ఓట్లు, ఎంఎన్ఎం అభ్యర్థి వి.ఆనందరాజా 42,134 ఓట్లు దక్కించుకున్నారు. ఈ నేపథ్యంలో ఈ సారి తిరుచ్చి నియోజకవర్గం టిక్కెట్ మళ్లీ తనకే దక్కుతుందని ఎంతో ఆశలు పెట్టుకున్న సిట్టింగ్ కాంగ్రెస్ ఎంపీకి తీవ్ర నిరాశే ఎదురైంది. డీఎంకే కూటమిలో తిరుచ్చి నియోజకవర్గాన్ని ఎండీఎంకేకు కేటాయించటంతో ఆయన పోటీకి దూరమయ్యారు. ఇక ఎన్డీయే మిత్ర పక్షంగా అమ్మా మక్కల్ మున్నేట్ర కళగం మళ్లీ ఈ నియోజకవర్గంలో పోటీకి దిగుతోంది. అన్నాడీఎంకే, నామ్ తమిళర్ కట్చి అభ్యర్థులు కూడా పోటీలో ఉన్నారు. అన్నాడీఎంకే తరఫున మాజీ మంత్రి సి.విజయభాస్కర్ సిఫారసుతో పుదుకోటకు చెందిన పి. కరుపయ్యా పోటీ చేస్తున్నారు. కరుపయ్యా ఇసుక క్వారీల కాంట్రాక్టర్ కరికాలన్‌కు సోదరుడు. ఇటు ఎండీఎంకే అభ్యర్థి వైగో, అటు అన్నాడీఎంకే అభ్యర్థి కరుపయ్యా ఈ నియోజకవర్గానికి కొత్త ముఖాలు. తమ కూటమి పార్టీల మద్దతుతో సులువుగా గెలుస్తామనే ధీమాతో ఉన్నారు. ఏఎంఎంకే తరఫున మాజీ కౌన్సిలర్ పి.సెంథిల్‌నాథన్ పోటీ చేస్తున్నారు. ఇక ఎన్టీకే తరఫున రాజేష్ పోటీ చేస్తున్నారు. జల్లికట్టు ఉద్యమంలో, ఆ క్రీడకు అనుమతి పొందడానికి జరిపిన న్యాయపోరాటంలోనూ కీలక పాత్ర పోషించారు.

దురై వైగోకు మంత్రుల ప్రచారం... : ఏండీఎంకే అభ్యర్థి దురై వైగోకు మద్దతుగా తిరుచ్చి జిల్లాకు చెందిన మంత్రులు కేఎన్ నెహ్రూ, అన్బిల్ మహేష్ పొయ్యామొళి, పుదుకోటకు చెందిన మంత్రి ఎస్.రఘుపతి ముమ్మరంగా ప్రచారం చేస్తున్నారు. మంత్రి కే.ఎన్.నెహ్రూ వ్యూహరచనల ప్రకారమే నియోజకవర్గవ్యాప్తంగా ప్రచార కార్యక్రమాలు భారీ స్థాయిలో జరుగుతున్నాయి. అన్నాడీఎంకే అభ్యర్థి కరుపయ్యాకు మద్దతుగా ఆ పార్టీ మాజీ మంత్రులు సి. విజయభాస్కర్, పరంజోతి, ఎస్.వలర్మతి, మాజీ ఎంపీ పి.కుమార్, పార్టీ జిల్లా శాఖ నాయకుడు శీనివాసన్ ముమ్మరంగా ప్రచారం చేస్తున్నారు. 2019లో ఒంటరిగా పోటీ చేసి లక్షకు పైగా ఓట్లు పొందిన ఎండీఎంకే ఈ సారి బీజేపీ కూటమిలో చేరటం వల్ల తప్పకుండా గెలుస్తామని ఏఎంఎంకే అభ్యర్థి సెంథిల్‌నాథన్ ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఎన్టీకే అభ్యర్థి రాజేష్ కూడా ప్రచారం చేస్తున్నారు. తిరుచ్చి నియోజకవర్గం రాజకీయాల్లో కొత్త మలుపులు సృష్టిస్తుందని ప్రధాన పార్టీల నాయకులు భావిస్తారు. కనుకనే డీఎంకే అధ్యక్షుడు స్టాలిన్, అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి లోక్‌సభ ఎన్నికల ప్రచారాన్ని తిరుచ్చి నుండే ప్రారంభించారు.

స్థానికేతరులకే పట్టం.. : తిరుచ్చి నియోజకవర్గం ఓటర్లు స్థానికేతరులను గెలిపిస్తారని ఎన్నికల చరిత్రను పరిశీలిస్తే అవగతమవుతుంది. తిరుచ్చి నియోజకవర్గానికి 1951 నుంచి 2019 వరకు జరిగిన సార్వత్రిక ఎన్నికలు సహా ఉపఎన్నిక 19 సార్లు జరిగాయి. ఆ ఎన్నికల్లో ఆనంద్ నంబియార్ (1852-1967), ఎం.కల్యాణసుందరం (1971, 1977), రంగరాజన్ కుమారమంగళం (1998, 1999), దళిత్ ఎళిల్‌మలై (ఉప ఎన్నిక) ఎల్. గణేశన్ (2004), పి.కుమార్ (2009, 2014), ఎస్.తిరునావుక్కరసు(2019) గెలుపొందారు. వీరందరూ ఇతర జిల్లాలకు చెందినవారు. ఈ నియోజకవర్గంలో ఇప్పటివరకు జరిగిన ఎన్నికల్లో మూడుసార్లు వామపక్షాలు, మూడుసార్లు కాంగ్రెస్, రెండు సార్లు అన్నాడీఎంకే, టీఎంసీ, డీఎంకే, బీజేపీ తలా ఒకసారి చొప్పున గెలిచాయి. ప్రస్తుత ప్రచార సరళిని పరిశీలిస్తే డీఎంకే, అన్నాడీఎంకే అభ్యర్థుల మధ్యనే గట్టి పోటీ నెలకొన్నట్లు తెలుస్తోంది.

● ఇంతలోనే అంత మార్పా?!

మనసు మార్చుకున్న ఖుష్బూ

● 4 నుంచి ఎన్డీయేకి మద్దతుగా ప్రచారం



ఐసిఎఫ్, ఏప్రిల్ 1: ఎన్డీయే అభ్యర్థులకు మద్దతుగా బీజేపీ జాతీయ కమిటీ సభ్యురాలు, జాతీయ మహిళా కమిషన్ సభ్యురాలు ప్రముఖ నటి ఖుష్బూ ఈనెల 4 నుంచి ప్రచారం చేయనున్నారు. మహిళా కమిషన్ సభ్యురాలిగా ఎన్నికల ప్రచారం చేయడానికి ఎలాంటి అభ్యంతరాలు లేవని ఆ కమిషన్ ఉన్నతాధికారులు స్పష్టం చేయడంతో ఆమె ప్రచారానికి సిద్ధమవుతున్నారు. వచ్చే గురు, శుక్రవారాల్లో వేలూరులో ప్రచారం చేయనున్నారు. 6న చెన్నైలో, 7, 8 తేదీల్లో అండమాన్, 9న ముంబైలో ప్రచారం చేయనున్నారు. మళ్లీ రాష్ట్రంలో 11న కృష్ణగిరి, 12, 13న నామక్కల్‌లో, 14న తిరుప్పూర్, 20 నుంచి 24వ తేది వరకు కేరళ రాష్ట్రంలో ప్రచారం చేయనున్నారు.

మన మధ్య గొడవలొద్దు... సర్దుకుపోదాం

ప్యారీస్, ఏప్రిల్ 1: దిండుగల్ లోక్‌సభ నియోజకవర్గంలో డీఎంకే కూటమిలో సీపీఎం అభ్యర్థి సచ్చిదానందం, అన్నాడీఎంకే కూటమిలో ఎస్డీపీఐ అభ్యర్థి మహమ్మద్ ముబారక్ ఎన్నికల బరిలో ఉన్నారు. ఈ రెండు పార్టీలు ముమ్మర ప్రచారంలో పాల్గొంటున్నాయి. ముబారక్‌కు మద్దతుగా అన్నాడీఎంకే మాజీ మంత్రులు దిండుగల్ శ్రీనివాసన్, నత్తం విశ్వనాథన్‌లు వాహనంలో ప్రచారంలో పాల్గొన్నారు. ఆ సమయంలో సీపీఎం అభ్యర్థి సచ్చిదానందం ప్రచార వాహనం వారికి ఎదురుపడింది. వెంటనే రెండు వాహనాలు ఆపిన అభ్యర్థులు, ఒకరినొకరు పలుకరించుకున్నారు. అప్పుడు మైకులో మాట్లాడిన మాజీ మంత్రి శ్రీనివాసన్.. 'శుభాకాంక్షలు సచ్చిదానందం... మన మధ్య గొడవలొద్దు... సర్దుకుపోదాం.. ఓట్లు అభ్యర్థిద్దాం... ప్రజలు తీర్పు చెబుతారు' అని నవ్వుతూ మాట్లాడడడంతో ఇరువర్గాల కార్యకర్తలు కరతాళధ్వనులతో ఇద్దరు అభ్యర్థులకు శుభాకాంక్షలు తెలిపారు.

అలంకార వాహనమంటే అలర్జీ

● డీఎంకే అభ్యర్థి సెంటిమెంట్

ప్యారీస్, ఏప్రిల్ 1: చూసేందుకు అలంకరించిన వాహనంలాగా ఉందని అసహనం వ్యక్తం చేసిన కోవై డీఎంకే అభ్యర్థి తన కోసం సిద్ధం చేసిన వాహనం ఎక్కేందుకు నిరాకరించి మరో వాహనంలో ప్రచారంలో పాల్గొన్నారు. ఈ లోక్‌సభ స్థానంలో డీఎంకే అభ్యర్థి రాజ్‌కుమార్ ఆదివారం సింగానల్లూర్ బస్టాండ్, నీలికోనంపాళయం ప్రాంతాల్లో కూటమి పార్టీల నేతలతో కలసి ప్రచారంలో పాల్గొన్నారు. ఆయన కోసం గుర్రాలతో బొమ్మలతో కూడిన అలంకార రథాన్ని పార్టీ నిర్వాహకులు ఏర్పాటుచేశారు. అయితే ఆ రథం ఎక్కేందుకు అభ్యంతరం తెలిపిన రాజ్ కుమార్, తాను ఆ వాహనంలో ఎక్కనని చెప్పి, టాపు లేని మరో ప్రచార వాహనంలో పయనమయ్యారు. దీంతో, అలంకార వాహనం చేసిన నిర్వాహకులు, రాజ్ కుమార్ సెంటిమెంట్‌ను పాటిస్తున్నారంటూ చలోక్తులు విసిరారు.

● ఎన్నికల సీజన్ కదా!

దేవుడిపై నాకెలాంటి కోపం లేదు!

● డీఎంకే నేత రాజా



చెన్నై, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): హిందూ మతంపై తరచూ విమర్శలు చేసి వివాదాల్లో చిక్కుకునే డీఎంకే సిట్టింగ్ ఎంపీ ఎ.రాజా ఇటీవల శ్రీరాముడిని మేమెప్పుడూ అంగీకరించం అంటూ వ్యాఖ్యలు చేసి కలకలం సృష్టించారు. అంతటితో ఆగకుండా శ్రీరాముడికి మేం శత్రువులం అంటూ ప్రకటించారు. ఈ మాటలు బీజేపీ నేతలకు తీవ్ర ఆగ్రహం తెప్పించాయి. డీఎంకే కూటమిలో ఉన్న కాంగ్రెస్ కూడా కాస్త ఇరకాటంలో పడింది. ఈ నేపథ్యంలో కున్నూరులో ఏర్పాటైన ప్రచార సభలో ఎ.రాజా మాట్లాడుతూ ... తన సతీమణి శ్రీరాముడి భక్తురాలని, ప్రతి శనివారం రామాలయానికి వెళ్లేదని, గురువారం తన కోసం, సోమవారం పరమేశ్వరుడి కోసం వ్రతమాచరించేదని, ఆమె పూజ గది ఇంకా పదిలంగా ఉందని చెప్పారు. ఆ పూజగదిలో ఏ రోజూ తాను అడుగుపెట్టలేదన్నారు. దేవుడిపై ఆమెకు నమ్మకం ఉన్నా తనకు నమ్మకం లేదని, సభకు విచ్చేసిన వారిలో చాలా మందికి దైవ నమ్మకం ఉందనే విషయం తనకు తెలుసునని చెప్పారు. దేవుడిపై తనకెలాంటి కోపం లేదని, కల్లాకపటం లేని మనస్సే దేవుడని, పేదల చిరునవ్వుల్లోనే దేవుడిని చూడగలమనే ద్రావిడ నేతల మాటలే తనకెంతో ఇష్టమని పేర్కొన్నారు.



వెనక్కి నడిస్తే కాళ్లకు బలం



ప్యారీస్, ఏప్రిల్ 1: రామనాథపురం లోక్‌సభ నియోజకవర్గంలో బీజేపీ కూటమి నుంచి పనస పండు గుర్తుపై పోటీ చేస్తున్న మాజీ ముఖ్యమంత్రి ఒ.పన్నీర్‌సెల్వం కలెక్టర్ కార్యాలయంలో జరిగిన అభ్యర్థులకు గుర్తుల కేటాయింపు కార్యక్రమంలో పాల్గొనేందుకు తన అనుచరులతో కలసి వెళ్లారు. కలెక్టరేట్ ప్రధాన ప్రవేశ ద్వారం వద్ద ఓపీఎస్ రాక కోసం వేచి ఉన్న ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు, ఓపీఎస్ ముందుకు నడుస్తుండగా మెల్లగా వెనక్కి నడుస్తూ కెమెరాల్లో రికార్డు చేశారు. అప్పుడు వారిని ప్రశ్నించిన ఓపీఎస్, వెనక్కి నడవడం వల్ల కాళ్లకు బలం వస్తుందని, అయితే జాగ్రత్తగా నడవాలని సలహా ఇచ్చారు.

గెలిపిస్తే అందరికీ అందుబాటులో ఉంటా

● సెంట్రల్ చెన్నై బీజేపీ అభ్యర్థి వినోజ్ పి.సెల్వం



సింగన్న వీధిలో ప్రచారం చేస్తున్న బీజేపీ అభ్యర్థి వినోజ్ పి. సెల్వం

చెన్నై, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): సెంట్రల్ చెన్నై నియోజకవర్గ ప్రజలు తనను గెలిపిస్తే ఎల్లప్పుడు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తానని ఆ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి వినోజ్ పి.సెల్వం అన్నారు. సోమవారం ఆయన అగ్రహారం వీధి, మంగపతి వీధి, కోవూరు వైద్యనాథన్ వీధి, వేదగిరి వీధి, వెస్ట్ కూవమ్ రివర్ రోడ్డు, సామినాయకన్ వీధి, సింగన్న వీధి, కృష్ణప్ప వీధి, నైనియప్పన్ వీధి, కుట్టి వీధి, సుంకువారి అగ్రహారం, వీధి, రిచీ స్ట్రీట్, పంపింగ్ స్టేషన్ తదితర ప్రాంతాల్లో ప్రచారం సాగించారు. దారిపొడవునా స్థానికులు, పార్టీ శ్రేణులు ఆయనకు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... నియోజకవర్గంలో పదేళ్లుగా ఎలాంటి అభివృద్ధి పనులు జరగలేదని, సిట్టింగ్ ఎంపీకీ ఈ నియోజకవర్గం పరిధిలో ఉన్న 38 వార్డులు గురించిగానీ, ప్రధాన వీధుల పేర్లు తెలియవని, నియోజకవర్గం అభివృద్ధిని పూర్తిగా విస్మరించారని ఆరోపించారు. ఎన్నికల ఫలితాల తర్వాత నియోజకవర్గం ప్రజలకు అందుబాటులో ఉంటానని, వారి అభివృద్ధి కోసం పాటుపడతానని హామీ ఇచ్చారు. నియోజకవర్గాన్ని సమగ్రంగా అభివృద్ధి చేయాలంటే బీజేపీని గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు.

● అదను చూసి వాత

వైగై నదిలో నల్లజెండాలతో ధర్నా



వైగై నదిలో నల్లజెండాలు పట్టుకుని ధర్నా చేస్తున్న జాలర్లు

చెన్నై, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): తేని జిల్లా వైగై నదిలో చేపల పెంపకం కోసం వ్యర్థాలు వేస్తున్న వేలం పాటదారులను ఖండిస్తూ జాలర్లు నల్లజెండాలతో ధర్నా జరిపారు. లోక్‌సభ ఎన్నికలను బహిష్కరించనున్నట్లు ప్రకటించారు. యేటా ప్రజాపనుల శాఖ, మత్స్యశాఖ ఆధ్వర్యంలో వైగై నదిలో చేపలు పట్టుకునేందుకు వేలం నిర్వహిస్తున్నారు. వేలం దక్కించుకున్నవారు ఆ నదిలో చేపలు పుష్టికరంగా పెరిగేందుకు వ్యర్థాలను పారబోస్తున్నారు. దీంతో ఆ నది కాలుష్యం అధికమైంది. చేపల వేలం ను రద్దు చేసి, ఆ నదిని శుభ్రం చేసేందుకు చర్యలు చేపట్టాలని కోరుతూ వడవీరనాయకన్‌పట్టి, చక్కరైపట్టి తదితర గ్రామాలకు చెందిన జాలర్లు తమిళ్ దేశీయ ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ తేని నగర శాఖ ప్రధాన కార్యదర్శి పొన్మణి నాయకత్వంలో జాలర్ల సంఘం నాయకుడు పళనియాండి, గ్రామస్తులు కలిసి సోమవారం ఉదయం వైగై నదిలో దిగి నల్లజెండాలతో ధర్నా నిర్వహించారు. తమ డిమాండ్‌ను ఆమోదించకపోతే లోక్‌సభ ఎన్నికలను బహిష్కరిస్తామని ప్రకటించారు. ఈ విషయం తెలుసుకున్న అధికారులు, పోలీసులు హుటాహుటిన అక్కడికి వెళ్లి ఆందోళనకారులతో చర్చలు జరుపుతున్నారు.



వేలూరు పాత బస్టాండ్‌లో సోమవారం లోక్‌సభ ఎన్నికల్లో 100 శాతం పోలింగ్‌కు అందరూ సహకరించాలని కోరుతూ కళాకారుల కళా ప్రదర్శన



తేని నియోజకవర్గంలో బీజేపీ కూటమి తరఫున పోటీ చేస్తున్న అమ్మా మక్కల్ మున్నేట్ర కళగం (ఏఎంఎంకే) అభ్యర్థి టీటీవీ దినకరన్‌కు మద్దతుగా 'కుక్కర్' గుర్తుకు ఓట్లు వేయాలని అభ్యర్థిస్తున్న ఆయన భార్య అనురాధ

● ఎందుకంత కన్ఫ్యూజన్?

బీజేపీ ప్రచార వాహనంలో అన్నాడీఎంకే జెండా



బీజేపీ అభ్యర్థి మురుగన్ వాహనంపై ఏర్పాటైన అన్నాడీఎంకే జెండా

ప్యారీస్, ఏప్రిల్ 1: నీలగిరి (రిజర్వుడు) లోక్‌సభ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి, కేంద్ర మంత్రి ఎల్.మురుగన్ ప్రచార వాహనంలో అన్నాడీఎంకే జెండా చోటుచేసుకుంది. బీజేపీ కూటమిలో పీఎంకే, టీఎంసీ, ఏఎంఎంకే తదితర పార్టీలు భాగస్వామ్యం వహిస్తున్నాయి. అందువల్ల ఎల్.మురుగన్ కోసం నీలగిరి లోక్‌సభ నియోజకవర్గ పార్టీ నిర్వాహకులు ఏర్పాటు చేసిన ప్రచార వాహనంలో మిత్రపక్ష పార్టీల జెండాలు పొందుపరిచారు. ఊటీలోని మారియమ్మన్ ఆలయంలో పూజల్లో పాల్గొన్న అనంతరం ఎల్.మురుగన్ ప్రచారానికి తన వాహనంలో బయల్దేరారు. అప్పుడు మిత్రపక్ష పార్టీల జెండాల మధ్య కూటమిలో లేని అన్నాడీఎంకే జెండా ఉండడం ఆయన గుర్తించి తొలగించాలంటూ ఆదేశించడంతో పార్టీ సభ్యులు వెంటనే తొలగించారు. అన్నాడీఎంకే బహిష్కృత నేత ఒ.పన్నీర్ సెల్వం బీజేపీ కూటమిలో ఉన్న కారణంగా అన్నాడీఎంకే జెండాను కూడా ప్రచార వాహనంలో ఏర్పాటు చేసి ఉంటారని ప్రతిపక్ష సభ్యులు వ్యాఖ్యానించారు.

నటి శరణ్యపై పోలీసులకు ఫిర్యాదు!



శరణ్య పొన్‌వణ్ణన్

సీనియర్ శరణ్య పొన్‌వణ్ణన్‌పై ఓ మహిళ పోలీసులకు ఫిర్యాదు చేసింది. వాహన పార్కింగ్ స్థల వివాదంలో శరణ్య తనను దుర్భాషలాడుతూ హత్య చేస్తానని బెదిరించారంటూ ఆ మహిళ ఫిర్యాదు చేయడంతో పోలీసులు ఇరు వర్గాలను పిలిచి విచారిస్తున్నారు. అలాగే సీసీ కెమెరా ఫుటేజీలను కూడా విశ్లేషిస్తున్నారు. సీనియర్ నటిగా ఉన్న శరణ్య... సినీ దర్శకుడు పొన్‌వణ్ణన్‌ను వివాహం చేసుకున్నారు. ప్రస్తుతం ఈ దంపతులు విరుగంబాక్కంలో ఉంటున్నారు. అయితే, పార్కింగ్ స్థలం విషయంలో శరణ్యకు పొరుగింటి మహిళ శ్రీదేవికి మధ్య చిన్నపాటి గొడవ ఉంది. ఈ నేపథ్యంలో ఆదివారం మరోమారు వీరిద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. ఆ సమయంలో పరస్పరం ఒకరినొకరు దుర్భాషలాడుకున్నారు. చివరకు పొరుగింటి మహిళ నటి శరణ్యపై పోలీసులకు ఫిర్యాదు చేయడమే కాకుండా తనను బెదిరించినట్టుగా నిర్ధరించే సీసీ కెమెరా ఫుటేజీలను సమర్పించింది.

సెన్సేషనల్ ఆఫ్ ది ఇయర్ సాంగ్‌గా 'అయ్యోసామి నీ ఎనక్కు వేణాం'



సెన్సేషనల్ ఆఫ్ ది ఇయర్ సాంగ్ జ్ఞాపికను అందుకుంటున్న బృందం

బెస్ట్ సెన్సేషనల్ సాంగ్ -2023 అవార్డును 'అయ్యోసామి నీ ఎనక్కు వేణాం' పాట గెలుచుకుంది. ఇటీవల జరిగిన 16వ ఎడిషన్ ఫిల్మ్ ఫెస్టివల్ వేడుకల్లో ఈ అవార్డును దక్కించుకుంది. ఈ పాటకు రచయిత పొట్టువిల్ అస్మిన్ సాహిత్యాన్ని అందించారు. 'నాన్' అనే చిత్రం ద్వారా కోలీవుడ్‌లో సినీ గేయరచయితగా అస్మిన్ ఎంట్రీ ఇచ్చారు. ఈ పాటకు శ్రీలంకకు చెందిన ప్రముఖ సంగీత దర్శకుడు ససుక్కు బాణీని సమకూర్చగా, శ్రీలంక గాయకుడు విండీ నేపథ్యగానం చేశారు. ఈ పాటను శ్రీలంక ప్రేక్షకులు అమితంగా ఇష్టపడ్డారు. ఫలితంగా యూట్యూబ్ వ్యూస్‌లో సరికొత్త రికార్డును సృష్టించింది. ఈ నేపథ్యంలో ఈ పాట బెస్ట్ సెన్సేనల్ సాంగ్-2023 అవార్డును గెలుచుకోగా, జ్ఞాపికను అస్మిన్, ససుక్కు, విండీ అందుకున్నారు. ఈ జ్ఞాపికను సినీ నటుడు, దర్శకుడు మనోజ్ భారతీరాజా, ఆస్ట్రేలియా కౌన్సిలర్ డేవిడ్ ప్రదానం చేశారు. కాగా, ఈ పాట అన్ని సోషల్ మీడియా ప్లాట్‌ఫాంలపై సుమారు 6 కోట్ల మంది నెటిజన్లు వీక్షించారు. చిన్నారుల నుంచి పెద్ద వరకు ప్రతి ఒక్కరూ అమితంగా లైక్ చేశారు. కుల, మత, జాతి, దేశాలకు అతీతంగా ఈ పాటను ఎంజాయ్ చేయడం గమనార్హం.

క్యూట్ రొమాన్స్ - కామెడీ మూవీగా 'కన్వన్'

● దర్శకుడు బీవీ శంకర్

చిత్రజ్యోతి



బీవీ శంకర్

జీవీ ప్రకాష్ కుమార్, ఇవాన జంటగా తాను రూపొందించిన 'కన్వన్' చిత్రం యాక్షన్, అడ్వెంచర్, ఎమోషన్‌తో పాటు క్యూట్ రొమాన్స్, కామెడీతో ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా ఉంటుందని ఆ చిత్ర దర్శకుడు బీవీ శంకర్ తెలిపారు. ఈ నెల 4వ తేదీన ఈ చిత్రం విడుదలకానుంది. దీన్ని పురస్కరించుకుని ప్రమోషన్ కార్యక్రమాలను ముమ్మరంగా చేస్తున్నారు. ఇందులోభాగంగా దర్శకుడు బీవీ శంకర్ మాట్లాడుతూ.. 'నిర్దిష్ట జానర్‌లో వచ్చే సినిమాలు ప్రేక్షకులను అమితంగా ఆకట్టుకుంటాయి. ఈ విషయంలో భాష, ప్రాంతీయ సరిహద్దులను కూడా అధికమిస్తుంది. స్వతహాగా సినిమాటోగ్రాఫర్ అయిన నేను.. ఈ అన్ని అంశాలు కలగలిపి ఈ సినిమాను రూపొందించా. ఈ సినిమా చూసేందుకు వచ్చే ప్రేక్షకులకు ఒక మంచి చిత్రాన్ని చూశామనే అనుభూతిని కలిగించేలా ఉంటుంది. దర్శకుడిగా నాకు అవకాశం ఇచ్చిన నిర్మాత ఢిల్లీబాబుకు ధన్యవాదాలు. వైవిధ్య భరితమైన కథలతో ప్రేక్షకులు మెచ్చేలా సినిమాలు అందించాలన్న ఆయన తపనకు అభినందనలు. ఈ సినిమా స్టోరీ వినిపించగానే ఆయన సమ్మతం తెలిపి, వెంటనే సెట్స్‌పైకి తీసుకెళ్లారు. ఔట్‌పుట్ చూశాక చిత్ర యూనిట్ సభ్యులు పడిన కష్టానికి ప్రతిఫలం దక్కిందన్న నమ్మకం కలిగింది. ఈ సినిమా కోసం ఒకవైపు హీరోగాను, మరోవైపు సంగీత దర్శకుడిగా జీవీ ప్రకాష్ అంకితభావానికి హ్యాట్సాఫ్. సినిమాలో తన సహజ నటనతో ఆకట్టుకున్న జీవీ ప్రకాష్.. పాటలకు అద్భుతమైన సంగీతాన్ని సమకూర్చారు. దర్శక దిగ్గజం భారతీరాజాతో కలిసి పనిచేయాలని చాలామంది కలలు కంటుంటారు. ఆ కల నాకు దర్శకుడిగా తొలి చిత్రంతోనే నెరవేరింది. ఇది నా అదృష్టంగా భావిస్తున్నా' అని పేర్కొన్నారు.